J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 42 సంచిక : 45 14.04.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## • మోడీకి ధీటుగా విపక్షాల జోడి

# ఏకమయ్యేనా.. ఏకు మేకయ్యేనా?

## ఐక్యత కుదిరేనా..? అధికారం దక్కేనా..??

"ఇంతింతై వటుడింతయై
మరియు దానింతై నభోవీధిపై
నంతై తోయదమండలాగ్రమున
కల్లంతై ప్రభారాశిపై" అన్నట్లుగా...

యావత్ ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తూ.. పాలనలో తనదైనముద్ర వేసుకుంటూ దూసుకుపోతున్నారు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడి. ఎవరు ఎన్ని విధాలుగా ప్రయత్నించినా అప్రతిహతంగా ఎదుగుతున్న మోడీ ఛరిష్మాని తగ్గించడం ఎవరికీ సాధ్యపడడంలేదు.



ఆయన దూకుడుకి అడ్డుకట్ట వేయాలని విపక్షాలు చేస్తున్న ప్రయత్నాలన్నీ సమర్ధవంతంగా తిప్పికొట్టడంలో ఇప్పటివరకు మోడీ & కోదే పైచెయ్యి. తాజాగా మోడీకి ధీటుగా మరో కొత్త జోడీ తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే నివాసంలో బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ తదితరులతో ఖర్గే, రాహుల్‌లు బుధవారం

10 లో

## • జిల్లాకి కొత్త సారధులు

# అభివృద్ధికి వారధులు

## కలెక్టర్‌గా ఎం.హరినారాయణన్,

## ఎస్పీగా కే.తిరుమలేశ్వరరెడ్డి





నెల్లూరుజిల్లా కొత్త కలెక్టర్‌గా హరినారాయణన్, కొత్త ఎస్పీగా తిరుమలేశ్వర్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇద్దరూ యువకులే. విధినిర్వహణ పట్ల పూర్తి అవగాహన కలిగిన బాధ్యతగల అధికారులు. ఓ వైపు సాధారణ పరిపాలన, మరోవైపు శాంతి భద్రతలు... రెండూ అత్యంత కీలకమైన విభాగాలు. ఈ రెండు విభాగాలకు ఒకేసారి కొత్త సారధులు రావడం విశేషం.

10 లో



# కలెక్టర్, ఎస్పీలకు ఆత్మీయ వీడ్కోలు



జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు, ఎస్పీ సిహెచ్ విజయారావులు బదిలీ అయిన సందర్భంగా సంబంధిత అధికారులు వారికి ఘనంగా వీడ్కోలు చెప్పారు. జిల్లా కలెక్టర్ ఏపి జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ అయిన విషయం తెలిసిందే. నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో ఈనెల 10న ఏర్పాటుచేసిన వీడ్కోలు సమావేశంలో రెవెన్యూ అధికారులు, ఎన్జీఓల సంఘాలవారు, స్వచ్ఛంధసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఇన్‌చార్జి కలెక్టర్ కూర్మనాథ్, కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, జిల్లా రెవిన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, నెల్లూరు, కావలి ఆర్డీఓలు మలోల, శీనానాయక్, డిఆర్డీఏ పీడీ సాంబ శివారెడ్డి తదితర అధికారులు మాట్లాడుతూ, కలెక్టర్‌గా చక్రధర్‌బాబు జిల్లాకు అందించిన విశిష్ట సేవలను కొనియాడారు. పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది ఎస్పీ విజయారావుకు వీడ్కోలు పలికారు. పూలతో అలంకరించిన వాహనాన్ని ఎస్పీ కార్యాలయం వరకు తాడుతో లాగుతూ గౌరవంగా తీసుకునివచ్చారు. ఉద్యోగులు, సిబ్బంది అందరికీ కలెక్టర్, ఎస్పీలు ధన్యవాదాలు తెలిపారు.

# ప్రజలను దోచుకుంటున్న ప్రభుత్వం

## కోటంరెడ్డి శీనయ్య ధ్వజం



ఈ నాలుగేళ్ళల్లో వైకాపా ప్రభుత్వం విద్యుత్‌చార్జీల పేరుతో దాదాపు 57 వేల కోట్ల రూపాయల దాకా అదనపు భారం మోపిందని, ప్రభుత్వం ప్రజలను దోచుకోవడమే పనిగా పెట్టుకుందని నెల్లూరు నగర టిడిపి నాయకుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ధ్వజమెత్తారు. పెంచిన చార్జీలకు నిరసనగా, ఈనెల 10న నెల్లూరులోని గాంధీబొమ్మ కూడలి వద్ద కిరోసిన్ బుడ్డీలతో దీపాలు వెలిగించి ఆందోళన చేశారు. జగన్ అధికారంలోకి వచ్చిన నాటినుంచి ప్రజలను పన్నులతో పీడిస్తున్నారని, ఇంత అధ్వాన్నపు పాలన ఎక్కడా చూడలేదని అన్నారు. టిడిపి నాయకులు మామిడాల మధు, కప్పిర శ్రీనివాసులు, పిట్టి సత్యనాగేశ్వరరావు, ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, విజేతరెడ్డి, ప్రశాంత్, మస్తాన్, ఆకుల హనుమంతు, మహేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మందులు లేకున్నా, మద్యానికి ఢోకా లేదు



వైకాపా ప్రభుత్వంలో కరోనా సమయంలో ప్రజలకు మందులు లేకున్నా, మందు (మద్యం)కు మాత్రం ఢోకా లేదని, నెల్లూరు పార్లమెంట్ టిడిపి నాయకురాలు పనబాక భూలక్ష్మి విమర్శించారు. ఈనెల 10న నెల్లూరు కలెక్టరేట్‌కు మహిళా నాయకురాళ్ళతో ఆమె వచ్చి జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌కు వినతిపత్రం సమర్పించారు. నాలుగేళ్ళు గడుస్తున్నా మద్యపాన నిషేధం లేదని, మద్యనిషేధం అంటూనే మద్యం ధరలను విపరీతంగా పెంచేశారని, మద్యం డబ్బులతో ప్రభుత్వ పథకాలు నడుస్తున్నాయని, 'అందరూ తాగండి.. ఖజానా నింపండి' అన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆమె మండిపడ్డారు. కల్తీమద్యం తాగి రాష్ట్రంలో ఎంతోమంది చనిపోతున్నారని, ఇకనైనా ప్రభుత్వం వీటిని అరికట్టాలని కోరారు.

# కనిగిరి రిజర్వాయర్‌ను కాపాడండి



కనిగిరి రిజర్వాయర్‌లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని, దీంతో రిజర్వాయర్ పరిస్థితి ప్రమాదకరంగా మారిందని, అక్రమార్కుల నుంచి దానిని కాపాడాలని మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కోవూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 10న నెల్లూరు కలెక్టరేట్ ప్రాంగణం వద్ద ఆందోళన చేపట్టారు. కనిగిరి రిజర్వాయర్‌ను గ్రావెల్ మాఫియా నుంచి కాపాడాలన్నారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కూర్మనాథ్‌కు వినతిపత్రం సమర్పించారు.

## స్పందన అర్జీలను

# వెంటనే పరిష్కరించండి

స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వస్తున్న అర్జీలకు సంబంధిత అధికారులు సత్వరం పరిష్కరించేందుకు కృషిచేయాలని నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి అధికారులను ఆదేశించారు. ఈనెల 10న నెల్లూరులోని కార్పొరేషన్ కార్యాలయంలో ఇన్‌చార్జి కమిషనర్ చెన్నుడుతో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించారు. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యాధికారి వెంకటరమణ, ఎస్ఇ సంపత్‌కుమార్, ఇఇలు సంజయ్, శేష గిరిరావు, మేనేజర్ ఇనయతుల్లా, ఆర్‌ఓలు సుమన్, శ్రీనివాసులు, రాజేశ్వరి, ఆర్ఐలు పద్మావతి, కృపాకర్, కృష్ణంరాజు, చిన్న బాబు, సునీల్, కృష్ణకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# జీతాలిప్పించండి సారూ!

## స్వీపర్ల అభ్యర్థన



తమకు అయిదు నెలలుగా జీతాలు లేవని కావలి పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిఐటియు ఆధ్వర్యంలో స్వీపర్లు ఈనెల 11న ఆర్డీఓ శీనానాయక్‌ను కలిసి తమ మొర వినిపించుకున్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని తమకు సకాలంలో జీతాలు ఇవ్వకపోవడంతో తమ కుటుంబాలు ఎన్నో అవస్థలు పడుతున్నాయని విన్నవించుకుంటూ, త్వరలో జీతాలిప్పించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో స్వీపర్ల సంఘం నాయకురాళ్ళు పద్మ,ర కామాక్షి, శోభ, సిఐటియు నాయకులు వైకె మోహన్, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## దాచూరులో..

# నాగవరపమ్మ గుళ్ళో చోరీ



కలువాయి మండలం దాచూరు గ్రామంలో ఉన్న నాగవరపమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. దేవస్థానం యజమాని దేవళ్ళ కామాక్షయ్య ఇల్లు కూడా ఆలయం పక్కనే ఉంది. రాత్రి 2.15 గంటల సమయంలో మెలకువ వచ్చి చూసేసరికి ఆలయంలో లైట్లు ఆరిపోయి ఉండడంతో అనుమానం వచ్చి, గుళ్ళోకి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గ్రహించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. 8 సవర్ల బంగారం, అమ్మవారి వెండి కిరీటం, శఠగోపం వగైరాలు అపహరణకు గురైనట్లు పోలీసులు గుర్తించారు. ఎస్ఐ మహేంద్ర వచ్చి గ్రామస్తులను విచారించారు. దొంగల కోసం గాలింపు చర్యలు ప్రారంభించారు.



# ప్రజల సంక్షేమమే.. సిఎం జగన్ లక్ష్యం

## - మంత్రి కాకాణి, రాజ్యసభ సభ్యులు బిఎంఆర్

ఎన్ని అడ్డంకులు ఎదురైనా, కరోనా వంటి విపత్కర పరిస్థితులు చవిచూసినా, ఇచ్చిన మాటకు కట్టుబడి ఎక్కడా రాజీపడకుండా అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని వైకాపా నేతలు స్పష్టం చేశారు. ఇటీవల కావలిలోని ఎంపీడిఓ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్ఆర్ ఆసరా మూడో విడత రుణమాఫీ నిధులు పంపిణీలో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బిఎంఆర్), కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి మంత్రి కాకాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రతి పథకానికీ మహిళలను కూడా భాగస్వాములను చేస్తూ ముఖ్యమంత్రి ప్రజల ప్రయోజనం కోసం అనేక పథకాలు అమలుచేస్తున్నారని కొనియాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేని విధంగా ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, కరోనా వంటి పరిస్థితుల్లో ఈ పథకాలు ప్రజలకు భరోసానిచ్చాయని బీద మస్తాన్‌రావు (బిఎంఆర్) చెప్పారు. బీసీలకు, ఎస్సీ,ఎస్టీలకు రాజకీయంగా ముఖ్యమంత్రి ప్రాధాన్యత కల్పించారని, ప్రతిఒక్కరి సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రిని మళ్లీ గెలిపించుకోవడం మనందరి బాధ్యతగా గుర్తించాలని ఆయన కోరారు. కావలిని కనక పట్టణంగా అభివృద్ధి చేసేందుకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని స్పష్టం చేశారు. తొలుత బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మెప్మా పీడీ రవీంద్ర, ఆర్డిఓ శీనానాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వింజమూరులో ఆర్‌జేడీ పరిశీలనలు

వింజమూరులోని ప్రభుత్వ పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లను భద్రపరిచేందుకు అవసరమైన గదులను ఈనెల10 ఆర్‌జేడీ సుబ్బారావు పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిహెచ్ మాలకొండయ్య, ఎంఐఎస్ కోఆర్డినేటర్ వై.మౌనికారెడ్డి, ఎం.శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

## కోవూరు చెరువు కలుజుపై..

# వంతెన కోసం ఆందోళన




కోవూరు చెరువు కలుజుపై వంతెన లేకపోవడంతో వర్షాకాలంలో పాటూరు, గుమ్మళ్ళదిబ్బ, బుచ్చి గ్రామాల ప్రజలకు ఎంతో ఇబ్బందిగా ఉందని, వెంటనే ఆ వంతెన నిర్మించాలని కోరుతూ కోవూరు సిపిఎం నాయకుల ఆధ్వర్యంలో ఈ నెల 10న ఆందోళన నిర్వహించారు. చాలా కాలం నుంచి ఈ వంతెనను నిర్మిస్తామని ప్రభుత్వాలు చెప్తున్నాయే కానీ, నేటికి ఆచరణలోకి రాలేదని వారు పేర్కొన్నారు. వంతెన నిర్మాణానికి ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించాలని వారు కోరారు. సిపిఎం నాయకులు శేషయ్యతో పాటు ఎస్‌కె బాబు, సుబ్బారావు, సురేంద్ర, సురేష్, విజయకుమార్, మల్లికార్జున్‌రెడ్డి, కాలేషా, హరి, బుజ్జయ్య, పెద్దబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# బిజెపిని నిరసిస్తూ.. ముత్తుకూరులో పాదయాత్రలు



కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ నిర్ణయాలు ప్రజా వ్యతిరేకంగా ఉన్నాయని, అందుకు నిరసనగా ఈనెల14 నుంచి 30వతేదీ దాకా ముత్తుకూరు మండలంలో పాదయాత్రలు నిర్వహిస్తామని సిపిఐ, సిపిఎం పార్టీల నాయకులు తెలిపారు. ఈనెల 10న ముత్తుకూరు శ్రామిక భవన్‌లో సిపిఐ సర్వేపల్లి నియోజకవర్గ కార్యదర్శి నందయ్య, సిపిఎం మండల కార్యదర్శి అంకయ్యలు విలేకర్లతో మాట్లాడుతూ, అంబేద్కర్ జయంతి రోజున పాదయాత్ర ప్రారంభమవుతుందని, అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించి ప్రజలకు బిజెపి ప్రభుత్వ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరిస్తామని చెప్పారు. కమ్యూనిస్టు నాయకులు జయరామయ్య, కృష్ణమోహన్, సుధాకర్‌రెడ్డి, నాగరాజు, ఏడుకొండలు, శేషయ్య, మల్లికార్జున, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## జొన్నవాడ కామాక్షమ్మవారికి..

# ఉత్సవాల శోభ

**ఏప్రిల్ 27 నుంచి మహాకుంభాభిషేకాలు**

**ఉభయకర్తలుగా వేమిరెడ్డి దంపతులు**

**మే 10 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు**






***జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం జొన్నవాడ శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి దేవాలయంలో ఈనెల 27 నుంచి మే నెల3వ తేది వరకు అత్యంత వైభవంగా మహాకుంభాభిషేక మహోత్సవాలు జరుగనున్నాయి. ఆ తర్వాత వారం రోజుల్లోనే మే నెల 10 నుంచి ఏటా జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలు కూడా భారీఎత్తున జరుగుతాయి. అనంతరం కోటికుంకుమార్చన పూజలు కూడా చేయాలన్న ఆలోచనలో ఉన్నారు. ఆ మేరకు ఆలయ అధికారులు, పాలక మండలి, జిల్లా అధికారులు సంయుక్తంగా పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో కామాక్షమ్మ అమ్మవారి ఆలయం ఉత్సవాల శోభతో.. కొత్త కాంతులతో ప్రకాశమానమవుతోంది.***

భక్తుల కొంగుబంగారం, కోరిన కోర్కెలు నెరవేర్చే చల్లనితల్లి.. మహాశక్తి జొన్నవాడ కామాక్షమ్మ అమ్మవారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలో పెన్నానది ఒడ్డున ప్రాచీనకాలం నుంచి వెలసివున్న దైవక్షేత్రమిది. జిల్లాలోని అమ్మవారి దేవాలయాల్లో ఈ ఆలయం ఎంతో విశిష్టమైనది.. మహిమాన్వితమైనది కూడా. నిత్యం ఈ ఆలయానికి వేలసంఖ్యలోనే భక్తులు వస్తుంటారు. ఏ ఉత్సవాలు జరిగినా రాష్ట్రం నలుమూలల నుంచి భక్తజనం లక్షల్లో తరలివస్తుంటారు. ఆలయంలో జరిగే పూజలు కూడా విశేషంగానే ఉంటాయి. ఈ నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్త ఖ్యాతిగన్న ఈ ఆలయంలో ఎంతో విశిష్టమైన మహాకుంభాభిషేక వేడుకలు ఎప్పుడో 1969లో కంచి పీఠాధిపతులు శ్రీ చంద్రశేఖర సరస్వతీస్వాములవారి ఆధ్వర్యంలో కన్నులపండువగా జరిగాయి. ఆ తర్వాత మళ్ళీ 2008లో శ్రీ జయేంద్ర సరస్వతి స్వాములవారి ఆధ్వర్యంలో మహాకుంభాభిషేకాలు అత్యద్భుతంగా నిర్వహించారు. ఇప్పుడు దాదాపు 15 సంవత్సరాల తర్వాత కంచిస్వాముల ఆశీస్సులతో అంగరంగ వైభవంగా అమ్మవారి ఆలయంలో మహాకుంభాభిషేకాలు జరుగనుండడం సంతోషదాయకం. రాజ్యసభ సభ్యులు, 'సేవాభూషణులు', ప్రముఖ ఆధ్యాత్మిక సామాజిక సేవా పరాయణులైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి.. టిటిడి ఉత్తర భారతదేశ ఆలయాల అభివృద్ధి సలహామండలి(న్యూఢిల్లీ) ఛైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, వీరితో పాటు హైదరా బాద్‌కు చెందిన భక్తులు కొలను రాజా రెడ్డి-పూజిత దంపతులు కూడా ఈ మహాకుంభాభిషేక మహోత్సవాలకు ఉభయకర్తలు కావడంతో వీరి సారధ్యంలో జరిగే అమ్మవారి వేడుకలు మరింత దేదీప్యమానంగా ఉంటాయని అందరూ ఆశిస్తున్నారు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పర్యవేక్షణలో అనేక మంది ప్రముఖులు ఈ ఉత్సవాలకు రానుండడంతో ఆలయ పాలకమండలి వారు ఇప్పటినుంచే అందుకు తగ్గ ఏర్పాట్లు, అలంకరణలు చేపట్టారు. త్వరలోనే ఆలయంలో ఉన్న అద్దాల మండపాన్ని కూడా దాతల సహకారంతో పునర్నిర్మించనున్నారు. ఇప్పటికే గోశాల నిర్మాణం పూర్తైంది. ఆలయం వద్ద త్వరలోనే అన్న ప్రసాద సత్రాన్ని, భక్తులకు వసతి సముదాయాన్ని కూడా నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ కార్యదర్శిగా

## డా. సూరం శ్రీనివాసులు



టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ కార్యదర్శిగా మన నెల్లూరీయుడు, ప్రముఖ సాహితీవేత్త డా. సూరం శ్రీనివాసులు ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. సంస్కృతాంధ్ర భాషా ప్రవీణులుగా, వ్యాస మహాభారత వచనానువాదకులుగా ఆయన ప్రసిద్ధి. దాదాపు 40 సంవత్సరాల పాటు ఆయన పలు సంస్కృత కళాశాలల్లో ఉపన్యాసకులుగా, ప్రధానాచార్యులుగా కూడా పనిచేసి నెల్లూరు సీమకు కీర్తిప్రతిష్టలు తెచ్చిపెట్టారు. బహుగ్రంథ రచయితగా ఉత్తమ సాహితీ పరిశోధకులుగా, శతావధానిగా ఆయన బహుముఖప్రజ్ఞాశాలి.

డా. సూరం శ్రీనివాసులు నియమాకం పట్ల నెల్లూరులోని పలువురు సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు సంతోషం వ్యక్తం చేస్తూ ఆయనకు తమ శుభాకాంక్షలు తెలిపారు.






• మెట్టుకూరు దాతృత్వం

## రాపూరు అభివృద్ధికి.. 50 లక్షల విరాళం



ఉదయగిరి నియోజకవర్గ వైకాపా పరిశీలకుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డి, తన బావ.. రాపూరు ఎంపిపి చెన్ను బాలకృష్ణారెడ్డి జ్ఞాపకార్థం రాపూరు మండలంలో అభివృద్ధి పనులకు 50 లక్షల రూపాయల విరాళం ప్రకటించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈనెల 11న ఆయన రాపూరు మండల సర్వసభ్య సమావేశానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెన్ను బాలకృష్ణారెడ్డి ప్రజాసేవకు అంకితమై పనిచేశారని, ఎవరు ఏ ఇబ్బందిలో ఉన్నా ఆ సమస్యలు తీర్చేందుకు ముందుండేవారని గుర్తుచేసుకున్నారు. వారి మరణంతో మండలం ఒక ప్రజానాయకుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ బావ జ్ఞాపకార్థం ఇస్తున్న ఈ 50 లక్షల రూపాయలను ఎంపి ఫౌండేషన్ ద్వారా మండల పరిషత్‌కు అందజేస్తున్నామని, మండలంలో అవసరమైన అభివృద్ధి పనులకు ఆ నిధిని వెచ్చించాలని ఆయన కోరారు.

## తెలుగువారికి గర్వకారణం.. రామోజీరావు

**- మాజీమంత్రి సోమిరెడ్డి**



కృషితో, పట్టుదలతో చిన్నప్పటి నుంచి ఎంతో కష్టపడి ఉన్నతస్థానానికి చేరుకున్న రామోజీరావు నిజాయితీకి మారుపేరుగా నిలిచారని, 'ఈనాడు' పత్రిక అధిపతిగా, కోట్లాదిమంది ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని, 'మార్గదర్శి' ద్వారా వేలాది మందికి ఉపాధినిస్తున్నారని, రామోజీ ఫిల్మ్‌సిటీ తెలుగువారికే గర్వకారణమని, అలాంటి వ్యక్తిపై తప్పుడు కేసులుపెట్టి, హింసించాలని జగన్‌మోహన్‌రెడ్డి ప్రయత్నించడం దారుణమని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఈనెల 12న నెల్లూరులోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈనాడులో వస్తున్న వార్తలపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కక్ష పెంచుకున్నారని, అయితే ఎవరెన్ని కుట్రలు పన్నినా ఆ సంస్థలను ఎవరూ ఏమీ చేయలేరన్నారు. తాము చేస్తున్న అవినీతి అక్రమాలను ఎవరూ ప్రశ్నించకూడదనే భ్రమల్లో ఉన్న జగన్‌కు రామోజీరావుపై కేసుల విషయంలో భంగపాటు తప్పదన్నారు.




లాయర్
ఏప్రిల్ 14, 2023

# మండిపోతున్న మందుల ధరలు

అసలే భగ్గుమంటున్న ఎండలు, మరోవైపు పొంచివున్న కరోనాతో పాటు, రకరకాల వ్యాధులు. వీటినుంచి ఎలా గట్టెక్కాలి దేవుడా!.. అనుకుంటున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం మూలిగే నక్కమీద ఒక పెద్ద తాటికాయను వేసిన ట్లుగా.. అమాంతం ఒక్కసారిగా మందుల ధరలను పెంచే సింది. ఈ ఏప్రిల్ 1 నుంచి పేదలపై ఇప్పుడున్న కష్టాలకు అదనంగా మరో పెద్ద భారం మోపినట్లయింది. ఏ రోగమో రొష్టో వస్తే, దాన్నుంచి నివారణ పొందేందుకు ఏ మందోమాకో మింగుదామనుకుంటే, మంటల వేడికన్నా మండిపోతున్న మందుల ధరలను చూసి సామన్యులు, బక్కజనం బిక్కచచ్చి పోతున్నారు. ఇంక ఈ ధరలు తగ్గవా?..అంటూ ఆకాశం కేసి చూస్తున్నారు. కేంద్రప్రభుత్వ ఆధీనంలోని నేషనల్ ఫార్మా స్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పిపిఏ) ప్రకటన మేరకు ఏప్రిల్ నెల నుంచి ఈ పెరిగిన ధరలు అమలులోకి వచ్చేశాయి. సాధారణ మందులపై కూడా దాదాపు 12.12 శాతం ధరలు పెంచడంతో ప్రజలు అయోమయంలో పడిపోతున్నారు. జ్వరానికి, ఏవైనా ఇన్‌ఫెక్షన్లకు, రక్తహీనతకు, నొప్పి వస్తే తగ్గించు కోవడానికి, ఇప్పుడు తరచూ వస్తున్న గుండెజబ్బులకు, ఇంకా వేధిస్తూనే ఉన్నా క్షయవ్యాధికి..అధికశాతం మందకి ఉండే బీపీ, షుగర్ వ్యాధులకు, చర్మవ్యాధులకు, యాంటీబయోటిక్స్ మందులకు.. ఇలా దాదాపు అందరికీ అవసరమయ్యే, నిత్యావ సర మందుల్లో 800 రకాల మందులకు ఈ పెరిగిన ధరలు వర్తిస్తాయని చెప్తున్నారు. ఈ మందులకే కాక, మరో 384 రకాల ఖరీదైన మందుల ధరలను కూడా మరింతగా పెంచేం దుకు కేంద్రం అనుమతి ఇచ్చిందని కూడా అంటున్నారు. పెట్రో-డీజల్ ధరల పెరుగుదలతో నిత్యావసర వస్తువుల ధరలన్నీ పెరిగినట్లుగానే, ఇప్పుడు ముడిసరుకుల ధరలు పెరిగిపోతున్నాయంటూ నిత్యావసర మందుల ధరలు కూడా పెరిగిపోవడం పట్ల ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఒకరకంగా మందుల చరిత్రలోనే ఇంత భారీ పెంపు ఇదేనని కూడా నిపుణుల మాట. ఫార్మాకంపెనీల ఒత్తిడికి తలొగ్గి ప్రధాని నరేంద్రమోడీ సారథ్యంలోని కేంద్రప్రభుత్వం ఇలా ధరలు పెంచేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసిందంటూ విపక్షాలు విమర్శలు కూడా గుప్పిస్తున్నాయి. ఫార్మా కంపెనీల వారు మాత్రం మందుల ముడిపదార్థాల ధరలు, రవాణా ఖర్చులు, ప్యాకింగ్ ఖర్చులు అన్నీ పెరగడంతో, మందుల ధరలు కూడా పెరిగాయంటున్నారు. కానీ, ఒక్కసారిగా ఇంత భారీస్థాయిలో అనేకరకాల నిత్యావసర మందుల ధరలు ఆకాశానికంటడంతో సామాన్యులు ఆవేదన చెందుతున్నారు. జబ్బు సంగతి తర్వాత, మందుల బిల్లు చూస్తేనే గుండె జారిపోయే స్థితి వచ్చిందని మధ్యతరగతి వారు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో, ఒకవేళ మందుల ధరలు పెంచాల్సి వస్తే, పేదలకు-ప్రజలకు పెద్దగా భారం లేకుండా స్వల్పంగా..అంటే 2 లేదా 3 శాతం మాత్రమే పెంచేవారు. ఇప్పుడు ఏకంగా 12 శాతానికి పైగానే పెరుగుదల ఉండడాన్ని సామాన్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. అసలే మనదేశంలో రోగాలకు లెక్కేలేదు. కోట్లాదిమంది జనం ఉన్నా, ఆరోగ్యంగా ఉన్నవారిని వెదకి చూపాల్సిందే. బాలలు, మహిళలు, వృద్ధులు అత్యధికశాతం మంది ఎప్పుడూ ఏ జ్వరంతోనో జబ్బుతోనో బాధలు పడుతూనే ఉన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు, బాధలతో నెలకు వెయ్యి నుంచి 5 వేల రూపాయల మందులు దాకా కొని, మింగే అనారోగ్య బాధితులు లెక్కలేనంతమంది ఉన్నారు దేశంలో. బాగా ఆరోగ్యంగా ఉంటూ, ఏ మందులూ అవసరం లేని అదృష్టవంతులు ఏ కొద్దిశాతం మందో ఉంటారు. ప్రతి కుటుంబానికి నిత్యావసర సరుకుల బడ్జెట్‌తో పాటు, అవసరమైన మందుల కిట్టూ, దానికో బడ్జెట్టూ తప్పనిసరి. దేశంలో ఇప్పుడు అక్కడక్కడా కరోనా కేసులు కూడా వస్తున్నాయి. మళ్ళీ అదెక్కడ వీరంగం చేస్తుందేమోనని ప్రజల్లో లోలోపలే తెలియని ఆందోళన. ఉప్పు పప్పుల దగ్గర నుంచి మార్కెట్లో ఏ వస్తువు కొనాలన్నా ధరలు భగ్గుమంటున్నాయి. ధరలు పెరుగుతుండడం తప్పితే తగ్గడం అన్న మాటే ఉండడం లేదు. ఇక సగటు మనుషులు కొనేదేందీ?..తినేదేందీ?..ఆ జాబితాలో ఇప్పుడు మందులు కూడా చేరిపోయాయి. అయితే, అన్నం తినకపోయినా పర్వా లేదు కానీ మందులు మాత్రలు మింగకపోతే పరిస్థితేమిటి?.. ఈ పరిస్థితులన్నిటినీ, పేద-నిరుపేద, సామాన్య-మధ్యతరగతి, బీదాబిక్కీ బడుగువర్గాల ప్రజలందరి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రధాని మోడీ, కేంద్రప్రభుత్వం, నిపుణులు అందరూ మరోసారి ఈ ధరలను సమీక్షించి, వాటి ధరలు ప్రజలకు భారంగా లేకుండా చూడాలన్నదే అందరి ఆకాంక్ష!...

## ‘స్పా’ల ముసుగులో..వికృత చేష్టలు



నెల్లూరును రకరకాల దరిద్రాలు చుట్టు ముడుతున్నాయి. రానురాను అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతోంది మన నగరం. అరచేతిలో మాయాప్రపంచాన్ని చూపించే సెల్‌ఫోన్లు వచ్చేశాక, పాశ్చాత్య విషపు సంస్కృతి యువతను ఇట్టే ఆయ స్కాంతంలా ఆకర్షిస్తోంది. తల్లితండ్రులంటే ఏమాత్రం గౌరవం లేకపోవడం, చదువు చెప్పిన గురువులను కూడా ఎగతాళి చేయడం, ఇరవై నాలుగు గంటలూ ఫోన్లలో చూడాల్సిన మంచివాటిని చూడకుండా, చూడగూడనివన్నీ చూసేస్తుండడం బాగా అలవాటైపోయింది. సెల్‌ఫోన్ చేతిలో లేకపోతే ప్రపంచమంతా తలక్రిందులై పోతున్నట్లుగా తయారైంది పరిస్థితి. ఫోన్‌లలో మంచి–చెడు రెండూ ఉంటాయి. మన విజ్ఞతతో మంచినే ఎన్నుకోవాలి. సమాజంలో ఎన్నో రకాలుగా మోసాలు చేసేవారుంటారు. వారి ఆటలకు, మాటలకు ఎందరో ఎన్నో విధాలుగా నష్టపోతూనే ఉన్నారు. ఆ పిల్లలు ఏం చూస్తున్నారో, ఏం చేస్తున్నారో తెలుసుకునే పరిస్థిత కూడా కొందరు అమ్మానాన్నలకు ఉండడం లేదు. దీంతో వారు ఆడిందే ఆట, పాడిందే పాటగా తయారవుతోంది. విచ్చలవిడి తనం, అరాచక మనస్తత్వం అన్నీ దీంతోనే ప్రారంభమవుతున్నాయి. ఆ బాపతులోంచి వచ్చిందే హైటెక్ ‘స్పా’ల బాగోతం. బాడీ మసాజ్ (శరీర మర్దన) చేసుకుంటే అందం, ఆరోగ్యం అన్నీ బాగుంటాయని నమ్మబలుకుతూ, ‘స్పా’ల ముసుగులోకి యువతను లాగేయడం ఇందులో లోగుట్టు. ఒక్క నెల్లూరులోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా, దేశమంతటా కూడా అనేకరకాల ‘స్పా’లు, సెలూన్లు వగైరాలన్నీ యువతను చుట్టుముడుతున్నాయి. ఇందులో నిజంగా ఆరోగ్యం కోసం నిబద్ధతతో పనిచేసేవి ఏ కొన్నో ఉంటాయి. స్పాల పేరుతో యువతీ యువకుల్ని వలలో వేసుకుని, వారిచేతనే చీకటిపనులు చేయించడం, తద్వారా సులభంగా డబ్బు సంపాదించేదుకు ప్రయత్నించడం వంటి వాటికి పాల్పడేవి అధికంగా ఉంటున్నాయి. మొన్నటికి మొన్న నెల్లూరు నగరంలో కూడా కొన్ని స్పాలు చీకటిపనుల్లో మునిగి తేలుతున్నాయనే విషయం బయటపడడం నగర ప్రజలను విస్మయానికి గురిచేసింది. ‘స్పా’ల ముసుగులో అసలేం జరుగుతున్నదో పోలీసులు సైగ్గా ఆరాతీసి, అసలు బండారం బయటపెట్టారు. కొన్నిచోట్ల స్పాలలో చీకటి కార్యకలాపాలు జరుగుతున్నా యనే పక్కా సమాచారంతో పోలీసులు మొదట వాటి నిర్వాహకులపై దృష్టి సారించారు.

## సమస్యల తో ‘రణం’

తాము కూడా మామూలు కస్టమర్లలాగనే కొందరిని పంపి, అక్కడేం జరుగుతున్నదో అన్ని విషయాలు రాబట్టారు. స్పాల ముసుగులో చీకటి కార్యక్రమాలు జరుగుతున్నాయని నిర్ధారించుకున్నాక, ఆ కేంద్రాలపై దాడులు చేసి నిర్వాహకులను అరెస్ట్ చేశారు. బాలాజీనగర్, రామ్మూర్తినగర్, దర్గామిట్ట ప్రాంతాల్లో ఉన్న ఆ స్పాల్లో నిందితులతో పాటు, ఇతర రాష్ట్రాలకు చెందిన ఎనిమిదిమంది యువతులను కూడా అదుపులోకి తీసుకున్నారు. మసాజ్‌ల పేరుతో యువతీయువకులను మభ్యపెడుతూ, వారిని చెడదోవ పట్టిస్తున్న స్పాలపై పోలీసులు గట్టి నిఘా ఉంచారు. ఇంకా ఎక్కడెక్కడ ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయో నిఘా బృందాలతో ఆరా తీస్తున్నారు. ‘స్పా’ల పేరుతోనే కాదు, నగరంలో పలు చోట్ల లైంగికవ్యవహారాలు, అసభ్య కార్యకలాపాలు గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోతూనే ఉన్నాయనేది బహిరంగ రహస్యం. స్పాల పేరుతోనే కాదు, కాసులకి కక్కుర్తిపడి, అమాయకులైన యువతీ యువకులను వలలో వేసుకుని లైంగిక కార్యకలాపాలు నిర్వహించేవారూ లేకపోలేదు. అలాంటి వారు పలుసార్లు పోలీసులకు పట్టుబడిన సంఘటనలున్నాయి.

### నైతిక బోధనలే ముఖ్యం :

ఇలాంటి చీకటిపనులకు పాల్పడకుండా, సమాజంలో ఏది మంచో, ఏది చెడో తెలియజెప్తూ చిన్నతనం నుంచి పిల్లలను కాపాడుకోవాల్సింది తల్లితండ్రులు, ఉపా ధ్యాయులే. వారు విజ్ఞానవంతులయ్యేదాకా వీరు విశ్రమించకూడదు. వారి ఆరోగ్యం, చదువు, అలవాట్లు..వారి స్నేహితుల గుణగణాలు అన్నీ తల్లితండ్రులు తెలుసుకుని, వారిని అనునిత్యం మంచివైపు పయనించేలా చూడాలి. కానీ కొన్ని పాఠశాలలు, కళాశాలల్లో కూడా విద్యార్థినుల పట్ల లైంగిక దాడులు, అవహేళనలు జరుగుతుండడం ఘోరం. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ వంటి వాటికి పాల్పడి జీవితాలను నాశనం చేసుకోండా వారిని ఎప్పటికప్పుడు చైతన్యవంతం చేస్తుండాలి. మత్తుకి, మాదకద్రవ్యాలకీ దూరంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

పిల్లలు చెడు స్నేహాలు చేయకుండా కనిపెట్టుకుని ఉండాలి. ఫోన్లలో వారు ఏం చూస్తున్నారో, వారు ఏం చేస్తున్నారో? కూడా గమనిస్తుండాలి. అయితే, కొంతమంది పెద్దలకు ఆ తీరిక, ఓపికా ఉండడం లేదు. మరికొంతమందికి పిల్లలను నియంత్రణలో పెట్టడం వారి చేతుల్లో లేకుండా పోతోంది. ఇంకొన్ని సంఘటనల్లో.. కంచే చేను మేసినట్లు, సమాజానికి మేలు చేయాల్సిన వారే, సభ్యసమాజం తలదించుకునే విధంగా ప్రవర్తిస్తుంటే ఏమనుకోవాలి?.. అందుకే, చిన్నతనం నుంచి నైతిక విద్యాబోధన ఎంతో ముఖ్యం. సమాజం పట్ల బాధ్యతగా మెలిగేందుకు, దురలవాట్లకు.. వికృత చేష్టలకు దూరంగా ఉండేందుకు ఉపాధ్యాయవర్గాలు కృషిచేయాల్సి ఉంది. మంచి స్నేహితులు, సత్యాంగత్యం, సద్భావాలు కలిగివుండేలా నెలకొకసారైనా విద్యార్థుల మంచి అలవాట్లపై మక్కువ కలిగేలా తగు చైతన్యం కలిగించాల్సి ఉంది. ఏ స్పాలకో వెళ్ళి అక్కడ జరగకూడని నేరమో ఘోరమో జరిగిపోయాకనో, లేదా పోలీసులు పట్టుకున్నాకనో బాధపడడం కంటే, అలాంటి వాటికి దూరంగా ఉండడం ఇంటికి వంటికి మంచిది కదా!...

- సంచారి

## ఆదాల, ప్రసన్నల పుణ్యం

# మైపాడు రోడ్డుకి మోక్షం..!

చిరకాల సమస్యగా ఉన్న నెల్లూరు – మైపాడురోడ్డుకి ఎట్టకేలకు శాశ్వత పరిష్కారం లభించడం సంతోషంగా ఉంది. పర్యాటక ప్రాంతంగా పేరు పొందడంతో పాటు, నెల్లూరు కోనసీమగా కూడా మైపాడు ప్రాంతం ప్రసిద్ధి చెందింది. సెలవు రోజుల్లో వేలాదిమంది ఈ రోడ్డులో ప్రయాణిస్తుంటారు. ఇన్నాళ్లూ ఈ మార్గంలో ప్రయాణించే వాళ్ళు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటుండేవారు. ఇప్పుడు 48కోట్ల రూపాయలతో ఈ రోడ్డు కొత్త అందాలను సంతరించుకోబోవడం ఆనందదాయకం. ఈ ఘనతను సాధించిన నెల్లూరు పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకరరెడ్డి, కోవూరు ఎంఎల్ఏ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిలతో పాటు ఈ రోడ్డు అభివృద్ధి కోసం తపించిన స్థానిక నాయకులు, యువకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డికి నా అభినందనలు.

సత్యశ్రీ, ఇందుకూరుపేట.

# లంచం రాజకీయాలు

పండ్లని రసాయనాలేసి మాగబెట్టేటోళ్లు వుగ్రవాదుల్కంటే ప్రమాదకారులన్నారు న్యాయమూర్తి మార్గండేయ కట్టు. యెన్నికల్లో గెలవటాన్కి వొస్తువుల్ని, డబ్బుని, సారాయిని బంచేవోళ్లు – ఆ అవినీతి పెంటని సంచిలోనో, జోబిలోనో బెట్టుకొనేవోళ్లు, గొంతులో బోస్కోనేవోళ్లు – ప్రజాస్వామ్యం పేర్తో సంక్షేమ ప్రభుత్వాల్ని స్థాపించొచ్చున్న ప్రపంచ దేశాల ఆ విశిష్ట నాగరికతని అవహేళన్జేసి, ఆ వ్యవస్థని పరిమారుస్తున్న వుగ్రవాదులే.

యిటీవలి తెలంగాణ వుపయెన్నికల్లో – వాళ్లకి డబ్బులిచ్చారు. మాకీలేదని దృశ్య మాధ్యమం ముందు కొందరు గుంపుగ ఆడ, మగ జేరి నిష్ఠూరాలాడ్డం. మే యెన్నికల్లో బాల్గొనవడ్డం జూస్తుంటే – డబ్బులు, మొదలైనవియ్యటం, దీస్కోటం నేరం గాదు; ఐచ్చికమని – పోరంబోకు రాజకీయనాయకులంతా గల్సి, చట్టం జేస్తారేమోనన్పిస్తున్నది. తర్వాత్తర్వాతది చట్టబద్ధం గూడవద్దేమో యీ దేశంలో... ఛూ.. దరిద్రం...

– తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, ఒ-, నెల్లూరు.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

# గోహత్యలు నివారించండి

ఉదయగిరి నియోజకవర్గంలోని అనేక అటవీప్రాంతాల్లో, ముఖ్యంగా దుత్తలూరు మండలంలోని దుత్తలూరు, భైరవరం తదితర పల్లెల్లో, ప్రాంతాల్లో గోహత్యలు పెరిగిపోతున్నాయి. అడవుల్లో ఉన్న గోవులను పట్టుకుని, వాటిని అత్యంత దారుణంగా చంపేసి వాటి మాంసాన్ని విక్రయించుకుంటున్నారు. ఇనుప ఉచ్చులు వేసి, కరెంటు పెట్టి అడవుల్లోని గోవులను అక్రమంగా వేటాడి చంపుతున్నారు. డబ్బుకోసం ఇంత దారుణంగా ప్రవర్తిస్తున్నారు. ఉదయగిరి, దుత్తలూరు ప్రాంతాల్లో.. జంగాలపల్లి తదితర పల్లెల్లో అంతా ఈ సంగతి బహిరంగ రహస్యమే. ఇకనైనా జిల్లా పోలీసు ఉన్నతాధికారులు, అటవీశాఖ ఉన్నతాధికారులు వెంటనే గోవధను అరికట్టాలి.

కె. శ్యామలరావు, రాపూరు.

# దేవుని వెల్లంపల్లిలో రామ్‌కుమార్



## స్తంభాలగిరి ఈశ్వరయ్యస్వామికి పట్టువస్త్రాల సమర్పణ

వెంకటగిరి నియోజకవర్గంలోని డక్కిలి మండలంలో వెలసివున్న దేవుని వెల్లంపల్లి పంచాయతీలోని స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామివారి దేవాలయంలో ఈనెల 10న జరిగిన స్వామివారి కళ్యాణ మహోత్సవంలో కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మెన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యం పట్ల.. ప్రభుత్వం బాధ్యతగా ఉండాలి

### - వేదిక సావనీర్ ఆవిష్కరణలో వక్తలు

రాష్ట్ర ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 9న నెల్లూరులోని డా. జెట్టి శేషారెడ్డి విజ్ఞానకేంద్రంలో సావనీర్ ఆవిష్కరణ జరిగింది. నారాయణ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాసులురెడ్డి సావనీర్‌ను ఆవిష్కరించారు. ప్రోగ్రెసివ్ డాక్టర్స్ ఫోరం నాయకులు డాక్టర్ లింగారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజారోగ్యం పట్ల ప్రభుత్వం బాధ్యతగా ఉండాలని, ప్రభుత్వాసుపత్రులను అభివృద్ధి చేయాలని ఆయన కోరారు. వైద్యశాఖలో సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించాలని, మందులు, పరికరాలు కొరత లేకుండా సమకూర్చాలని, మొత్తంగా వైద్యశాఖను మరింత పటిష్టవంతం చేయాలని వారు సూచించారు. ప్రజారోగ్య వేదిక అధ్యక్ష కార్యదర్శులు ఎంవి రమణయ్య, టి.కామేశ్వరరావు, డాక్టర్ బి.రాజేశ్వరరావు, జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఈస్టర్ ప్రార్థనలు

ఈనెల 9న ఈస్టర్ పండుగ సందర్భంగా నెల్లూరులోని చర్చిల్లో క్రైస్తవసోదరులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించి భక్తిగీతాలను ఆలపించారు. సుబేదారుపేటలోని ఆర్‌సిఎం చర్చిలో మతగురువు ఎం.డి ప్రకాశం ఈస్టర్ విశిష్టతను తెలియజేస్తూ ప్రసంగించారు. విఆర్‌సి సెంటర్‌లోని డౌనీహాల్, ది లోన్‌స్టార్, పెంతెకోస్తు చర్చిలలో ఈస్టర్ ప్రార్థనలు జరిగాయి.

## నెరసం ఆధ్వర్యంలో..14న పుస్తకావిష్కరణ

నెల్లూరుజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేది సాయంత్రం 4 గంటలకు సండడి అరుణ రచించిన 'నా హృదయ తరంగాలు' కవితాసంపుటి ఆవిష్కరణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. టౌన్‌హాలు రీడింగ్‌రూంలో జరిగే ఈ ఆవిష్కరణోత్సవంలో ప్రముఖ నవలా రచయిత్రి డా. పెళ్లకూరు జయప్రద పాల్గొని పుస్తకావిష్కరణ చేస్తారని, ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వెంకటశ్రీనివాసులు సమీక్షిస్తారని, ముఖ్య అతిథిగా ప్రముఖ కవి చిన్ని నారాయణరావు పాల్గొంటారని నెరసం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏ.జయప్రకాష్, డా. పాతూరి అన్నపూర్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆరోజు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు కవిసమ్మేళనం నిర్వహిస్తామని తెలియజేశారు.

## చీటీల పేరుతో టోపీ

ఇంకా జనాలకి చీటీల మీద మోజు తీరడం లేదు. ఎన్నో చోట్ల మోసం జరుగుతూనే ఉన్నా, మనదాకా రాదులే అన్నట్లుగా ఉంటూ చీటీలు కట్టేస్తున్నారు. షరా మామూలుగా మోసపోతూనే ఉన్నారు. తాజాగా సీతారామపురం మండలంలోని అయ్యవారిపల్లెకు చెందిన ఓ కిరాణా వ్యాపారి చీటీలు కట్టించుకుని, జనం డబ్బు దాదాపు 40 లక్షల దాకా తీసేసుకుని, ఇంటికి తాళం వేసి మాయమైపోయాడట. సంవత్సరాల తరబడి ఎంతో నమ్మకంగా చీటీలు వేసేవాడని, ఎక్కడికి వెళ్లాడో తెలియడం లేదని, రెండు వారాలుగా కనిపించకపోవడంతో బాధితుల బాధ వర్ణనాతీతం. ఫోన్‌లో కూడా అందుబాటులోకి రావడం లేదని, ఆ వ్యాపారి తమకివ్వాల్సిన డబ్బు సంగతేమిటని బాధితులు ఈనెల 8న పోలీసులకు మొరపెట్టుకున్నారు.

## బీసీ సమస్యల సాధనకు ఉద్యమించాలి

జిల్లాలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల సాధనకు బీసీలు ఉద్య మించాలని బీసీ నాయకులు బూదాటి రాధయ్య, దేవరాల సుబ్రహ్మణ్యం, జనార్ధన్‌రాజు పిలుపునిచ్చారు. ఈనెల 11న నెల్లూరు టౌన్‌హాలు రీడింగ్‌రూమ్‌లో వారు సమావేశమై బీసీలంతా ఐకమత్యంగా సమస్య లను పరిష్కరించుకునేందుకు కృషిచేయాలని చెప్పారు. బీసీ సంక్షేమ సంఘం నాయకుడు శ్రీనివాసులు, వాల్మీకి సంఘం నాయకుడు వెంకటేశ్వర్లు, చేనేత ఐక్యవేదిక నాయకుడు బాలాజీ, సురేష్, వడ్డెర సంఘం నాయకుడు ప్రసాద్, బీసీ ఫెడరేషన్ అధ్యక్షుడు అంకయ్య, రజకసంఘం నాయకుడు వింజమూరు మస్తాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## 15న అయ్యప్పస్వామికి విశేష పూజలు

నెల్లూరు నగరం వేదాయపాలెంలో కొలువైవున్న శ్రీ స్వామి అయ్యప్ప దేవస్థానంలో ఏప్రిల్ 15వ తేదీ శనివారం రోజున శ్రీ అయ్యప్ప స్వామికి విశేష పూజలు చేస్తారు. ఉదయం 5 గంటల నుండి కేరళ సంప్రదాయ ఉ గాది దర్శనం జరుగుతుందని, వివిధ రకాలైన పండ్లు, కూరగాయలు, ధాన్యాలతో స్వామివారిని అలంకరిస్తారని ఆలయ అధ్యక్షులు గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు స్వామివారికి నవకాభిషేకం, విశేష పుష్పాభిషేకం, అర్చనలు ఉంటాయని, మహా హారతి, తీర్థప్రసాదాలు, అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తామని వారు పేర్కొన్నారు.

# ఎమ్మెల్సీగా పర్వతరెడ్డి ప్రమాణస్వీకారం




తూర్పురాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఈనెల 12న గుంటూరు జిల్లా వెలగపూడి శాసన మండలి ప్రాంగణంలో ప్రమాణస్వీకారం చేశారు. ఎంతో కోలాహలంగా జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో అభిమానులు, ఉపాధ్యాయ మిత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచి తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తనను గెలిపించిన ఉపాధ్యాయులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్సీగా.. ప్రభుత్వ-ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, శాసనమండలి చైర్మన్ మోషేనురాజు, సీనియర్ శాసనమండలి సభ్యులు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మోసకారుల పట్ల..ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### - ఏఎస్పీ హిమవతి హెచ్చరిక



అధికవడ్డీలు ఇస్తామని ఆశ చూపించే వారు, చీటీల పేరుతో డబ్బు దండుకుని ప్రజలను మోసం చేసేవారు, ఉద్యోగాలిప్పిస్తామని చెప్పి నిరుద్యోగులను మభ్య పెట్టేవారు.. ఇలా రకరకాల పేర్లతో మోసాలు జరుగుతున్నాయని, ప్రజలు వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పీ హిమవతి హెచ్చరించారు. ఈనెల 10 సోమవారం నాడు జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అధికారులు కూడా అలాంటి మోసాలను ఎప్పటికప్పుడు గమనిస్తుండాలని చెప్పారు. ఉద్యోగాలిప్పిస్తామంటూ మాయమాటలు చెప్పి డబ్బు దండుకునేవారు ఎక్కువయ్యారని, నిరుద్యోగులు అలాంటివారి పట్ల జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. వరకట్న వేధింపులు వంటి ఫిర్యాదులు అందితే పోలీసు అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ఆస్తుల తగాదాల్లో న్యాయపరమైన సలహాలు తీసుకుని, బాధితులకు న్యాయం చేయాలన్నారు. తల్లితండ్రుల పట్ల వారి పిల్లలు నిర్లక్ష్యంగా ఉంటే, వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. అప్పటికీ పిల్లలు వినిపించుకోని పక్షంలో వారిపై చర్యలకు ఉపక్రమించాలన్నారు. భార్యాభర్తలకు సంబంధించి వారినుంచి వస్తున్న ఫిర్యాదులపై తొందరపడి కేసులు నమోదుచేయకుండా, ఆ ఫిర్యాదులను కూలంకుషంగా విచారించాలన్నారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులకు సంబంధించిన కేసుల్లో సత్వరమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని ఆమె అధికారులకు సూచించారు. పోలీస్‌స్టేషన్లకు వచ్చే బాధితుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన అనంతరం, వారికి మధ్యాహ్నభోజనం పంపిణీ చేశారు. ఎస్సీఎస్టీసెల్-2 డిఎస్పీ శ్రీనివాస రావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్ర కారాగారంలో.. న్యాయ విజ్ఞాన సదస్సు

వెంకటాచలం మండలం చెముడుగుంట పంచాయతి పరిధిలోని జిల్లా కేంద్ర కారాగారంలో ఈనెల 11న న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. జిల్లా సీనియర్ సివిల్ న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీనివాసులునాయక్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఖైదీలు ఉచిత న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. పేదలు, వెనుకబడినవర్గాల వారు, దివ్యాంగులకు ఉచిత న్యాయసేవలు అందిస్తున్నామని వివరించారు. ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు.

## డీసీఓగా బాధ్యతలు స్వీకరించిన సుధాభారతి



జిల్లా సహకారశాఖ అధికారిణిగా సుధాభారతి ఈనెల 10న పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు కలెక్టరేట్ ఆవరణంలోని జిల్లా సహకారశాఖ కార్యాలయంలో ఈమె బాధ్యతలు చేపట్టగా, ఉద్యోగులు ఆమెకు శుభాకాంక్షలు చెప్పారు.

## బీజేపీ యువమోర్చా.. జిల్లా నేతగా అశోక్



భారతీయ జనతా యువమోర్చా జిల్లా అధ్యక్షునిగా గుత్తా అశోక్‌నాయుడు నియమితులయ్యారు. గతంలో ఏబీవీపీలో ఉంటూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఆయన కృషి చేశారు. బిజెపి నెల్లూరు పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షుడు గుండ్లపల్లి భరత్‌కుమార్‌యాదవ్ అశోక్‌కు ఆమేరకు నియామకపత్రాలను అందజేశారు.

## 'విశ్వోదయ' పూర్వ విద్యార్థినుల.. ఆత్మీయ సమావేశం



కావలిలోని విశ్వోదయ బాలికోన్నత పాఠశాలలో పూర్వవిద్యార్థినులు ఈనెల 9న ఆత్మీయంగా కలుసుకుని సమావేశం నిర్వహించుకున్నారు. 1983-88 సంవత్సరాల్లో 6 నుంచి 10వ తరగతి వరకు ఆ పాఠశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థినులు ఒకరికొకరు పరిచయం చేసుకుని పాఠశాలలో చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. నాటి ఉపాధ్యాయినులు జార్జినా, కుసుమాంబ, జయమ్మ, మహాలక్ష్మమ్మలను ఈ సందర్భంగా విద్యార్థినులు ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థినులు పల్లకి, పద్మజ, మంజుల, త్రివేణి, బీబీజాన్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## జ్యోతిరావు పూలేకి.. విపిఆర్ నివాళి



మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఈనెల 11న రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సామాజిక విప్లవోద్యమ పితామహులు, గొప్ప సంఘ సంస్కర్త అయిన మహాత్మా జ్యోతిరావు పూలే ఆదర్శాలు అందరికీ మార్గదర్శకమని ఆయన కొనియాడారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పూలే చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు.

## డిపిఆర్‌ఓగా సదారావు



జిల్లా సమాచార పౌరసంబంధశాఖ అధికారి (డిపిఆర్‌ఓ)గా కె.సదారావు ఈనెల 10న నెల్లూరులోని డిపిఆర్‌ఓ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. విజయవాడలోని ఆ శాఖలో ఉపసంచాలకులుగా పనిచేస్తున్న సదారావు నెల్లూరుకు బదిలీ అయి వచ్చారు. డివిజనల్ పిఆర్‌కఓ రమేష్, ఏపిఆర్‌ఓ రవీంద్ర, పిఆర్‌ఓ రవీంద్రకుమార్, డిపిఆర్‌ఓ కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని, జేసీ కూర్మనాథ్‌ను గౌరవపూర్వకంగా కలుసుకున్నారు.

## పర్యాటక శాఖ అధికారిగా.. వెంకటేశ్వర్లు

జిల్లా పౌరసరఫరాల శాఖ ఇన్‌చార్జిగా ఉన్న వెంకటేశ్వర్లును తాజాగా జిల్లా పర్యాటకశాఖ అధికారిగా నియమించారు. ఈ స్థానంలో పనిచేస్తున్న నాగభూషణం బదిలీ కావడంతో అప్పటినుంచి ఇప్పటిదాకా జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారిణి కనకదుర్గాభవాని ఆ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు వెంకటేశ్వర్లుకు పర్యాటక బాధ్యతలు అప్పజెప్పారు.

## బాధ్యతలు చేపట్టిన.. హరినారాయణన్



శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు నూతన కలెక్టర్‌గా నియమితులైన ఎం.హరి నారాయణన్ బుధవారం ఉదయం 10.30 గంటలకు జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌కు వచ్చిన కలెక్టర్ హరినారాయణన్‌కు జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్, కందుకూరు సబ్‌కలెక్టర్ శోభిక, డిఆర్‌ఓ వెంకట నారాయణమ్మ, కావలి ఆర్డీఓ శీనానాయక్, కలెక్టరేట్ పరిపాలనాధికారి షఫీ మాలిక్ తదితరులు స్వాగతం పలికారు.

## కార్పొరేషన్‌కు కొత్త కమిషనర్



నెల్లూరు నగరపాలక సంస్థకు కొత్త కమిషనర్ నియమితులయ్యారు. ఇప్పటిదాకా కమిషనర్‌గా ఉన్న హరితను తిరుపతి నగరపాలక సంస్థకు కమిషనర్‌గా నియమించి, ఆ స్థానంలో ఇటీవల వికాస్‌మర్మత్‌ను ప్రభుత్వం నియమించింది. డైరెక్టరేట్ ఆప్ విలేజ్ అండ్ వార్డ్ సెక్రటేరియట్‌లకు అడిషనల్ డైరెక్టర్‌గా సమర్ధవంతమైన సేవలందించిన వికాస్ మర్మత్ గతంలో వైఎస్సార్ జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్‌గా, టెక్కలి సబ్‌కలెక్టర్‌గా కూడా పనిచేశారు. త్వరలోనే ఆయన నెల్లూరులో బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

## సాయినాథుని సన్నిధిలో రక్తదానం



నెల్లూరు బాలాజీనగర్ శివారుల్లోని శ్రీ సాయిదర్బార్ అద్దాల మందిరం వారు ఇటీవల నిర్వహించిన రక్తదానం కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా, శ్రీసాయి నాధుడు ఆచరించి చూపిన మానవసేవలో భాగంగా ఈనెల 9న రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సాయి భక్తులు స్వచ్ఛందంగా వచ్చి 60 యూనిట్ల రక్తాన్ని అందించారు. నోవా బ్లడ్ బ్యాంక్ వారి సహకారంతో, మందిరం నిర్వాహకులు మధుసాయి, శ్రీ సాయిదర్బార్ యువసేవాదళ్ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం జరిగింది.



## జగన్‌పై జనంలో విశేషాదరణ

### ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం ఛైర్మెన్ ఆర్ఎస్ఆర్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజల్లో విశేషాదరణ ఉందని, సిఎం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలపై ప్రజలు ప్రశంసలు కురిస్తున్నారని నెల్లూరులోని శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఛైర్మెన్ రావు శ్రీనివాసరావు (ఆర్ఎస్ఆర్) చెప్పారు. ఈనెల10న ఆయన 20వ డివిజన్ వనంతోపు ప్రాంతంలో 'మా నమ్మకం, మా భవిష్యత్తు నువ్వే జగన్' కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల స్పందన అద్భుతంగా ఉందన్నారు. నాయకులు మొయిళ్ళ సురేష్‌రెడ్డి, రావూరి నరసింహారెడ్డి, రమాదేవి, రమేష్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, సరళమ్మ, అబ్రహం, రాజశేఖర్, రూపేష్, ప్రకాష్, చిన్నా, కార్తీక్, రాజా పాల్గొన్నారు.

## టీచర్ల నియామకాలు చేపట్టాలి

రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటస్తూ డిఎస్సీ-98 క్వాలిఫైడ్ టీచర్ల నియామకాలను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని బిటిఏ వ్యవస్థాపకుడు రమణయ్య, రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌లు ఈనెల 12న జిల్లా విద్యాశాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. బిటిఏ ప్రతినిధులు ఆదినారాయణ, మాల్యాద్రి, రఘు, శ్రీనివాసులు, మాధవ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రవేశపరీక్షలపై ఏబీవీపీ ఉచిత శిక్షణ 17న

ఈనెల 17వ తేదీన ఏబీవీపీ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్, ఏపిఆర్‌జేసీ ప్రవేశపరీక్షలపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని ఏబీవీపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. ఈనెల 11న ఆమేరకు డిఇఓ గంగాభవాని చేతులమీదుగా పోస్టర్లను ఆవిష్కరించారు. ఏబీవీపీ నగర కార్యదర్శి యశ్వంత్, బాలాజీ, రాహుల్, సాయి, నరసింహ, నవీన్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## 'తంగిరాల మహాభారతం' 50వ భాగం

శ్రీకృష్ణుడు, బలరాముడు కుమ్మరి ఇంటికి వచ్చి పాండవులకు తమని పరిచయం చేసుకుని, మేనత్త కుంతికి నమస్కరిస్తారు. ధర్మరాజుని గౌరవించి మిగతా వారిని ఆశీర్వదించి తమ నిజ నివాసాలకు వెళ్ళిపోతారు. ద్రుపదుడు మత్స్య యంత్రాన్ని కొట్టిన బ్రాహ్మణుని చరిత్ర, కులవంశాలు కనుక్కురమ్మని ధృష్టద్యుమ్నుడుని ఆదేశిస్తాడు. ధృష్టద్యుమ్నుడు దొంగతనంగా వెళ్ళి అక్కడున్న సంగతులన్నీ గ్రహించి వెనక్కు వెళ్ళి తన తండ్రికి చెపుతాడు.

ఈ బ్రాహ్మణులిద్దరు ద్రౌపదిని తీసుకెళ్ళి ఒక ముసలావిడకు పరిచయం చేస్తారు. ఆ ఐదుగురిలో పెద్దవాడు మిగితావాళ్లను భిక్షాటనకు పంపుతాడు. వారు తెచ్చిన అన్నాన్ని ఆ ముసలావిడ ద్రౌపదిని పిలిచి ఎలా భాగాలూ చెయ్యాలో చెపుతుంది. ద్రౌపది వాళ్ళు పెట్టిన భిక్షాన్నము తిని, వారిలాగే నేలమీద పడుకుంది.




పడుకోబోయే ముందు, వాళ్ళు సమరానికి సంబంధించిన వాటినే చర్చించుకున్నారు. వాళ్ళు చూడటానికి క్షత్రియులుగానే ఉన్నారని చెపుతాడు. తర్వాత ద్రుపదుడు తన పురోహితుణ్ణి వారి గురించి కనుక్కురమ్మని పంపుతాడు. ధర్మరాజు తమ గురించి చెప్పకుండా, ద్రుపద మహారాజు పెట్టిన నియమం ప్రకారమే మత్స్య యంత్రాన్ని ఛేదించాడని ఎక్కడా కుల, నామ ప్రస్తావన లేదుకదా, బలపరాక్రమం లేనివాడు, కులహీనుడు, అస్త్రవిద్య కౌశలం లేని అసమర్ధుడు కొట్ట లేడు కదా అని అతన్ని పంపించేస్తాడు. ద్రుపదుడు అన్ని వర్ణాల రథాలు పంపి పాండవులను ఆహ్వానించినప్పుడు వారు క్షత్రియ రథాల్లో వస్తారు. తర్వాత వారికి చ్చిన కానుకల్లో, యుద్ధానికి సంబంధించిన వాటినే స్వీకరిస్తారు. ద్రుపదుడు వారు ఖచ్చితంగా క్షత్రియులేనని నిశ్చయించుకుంటాడు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.
పూర్తి నిడివి కోసం
Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.




## పార్కిన్‌సన్స్ వ్యాధిపై అవగాహన అవసరం

### డాక్టర్ బిందుమీనన్

పార్కిన్‌సన్స్ వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని, చేతులు వణకడం, నడక మారడం, మాట తడబడడం వంటి లక్షణాలుంటే ముందు జాగ్రత్తగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని ప్రముఖ న్యూరాలజిస్ట్, అపోలో ఆసుపత్రి డాక్టర్ బిందుమీనన్ తెలిపారు. ఇది అంటువ్యాధి కాదని, ప్రాణాంతకమైన జబ్బు కూడా కాదని, మెదడులో డోపమైన్ ఉత్పత్తి లేకపోవడం వల్ల కలిగే సమస్య అని ఆమె చెప్పారు. ఈ వ్యాధిని పూర్తిగా నయం చేయడం సాధ్యం కాదని, అయితే చికిత్సల ద్వారా దీనిని బాగా నియంత్రించ వచ్చన్నారు. ఈ వ్యాధిపట్ల అపోహలను నమ్మవద్దని, అపోలో ఆసుపత్రిలో మంచి చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు.

## కోదండరామునికి పుష్పయాగం

నెల్లూరు ఉస్మాన్‌సాహెబ్‌పేటలో ఉన్న శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్న సందర్భంగా, చివరి రోజైన మంగళవారం నాడు వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఉత్సవాల ముగింపు సూచకంగా ధ్వజావరోహణం చేసి, అనంతరం స్వామి వారికి ఏకాంత సేవ జరిపారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ రమణకుమార్, కార్యనిర్వహణాధికారి దర్గయ్య పర్యవేక్షించారు.

## అమ్మా యూత్ ఫౌండేషన్ వితరణ



నెల్లూరులోని అమ్మా యూత్ ఫౌండేషన్ వారు ఈనెల 12న స్థానిక కిసాన్‌నగర్ రామచంద్రాపురంలో పేదలకు బియ్యం బస్తాలు, నిత్యావసర సరుకులను వితరణగా అందజేశారు. అఖిల్ జ్ఞాపకార్థం, వారి తల్లితండ్రులు రమేష్‌రెడ్డి-హరిత సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించామని ఫౌండేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు తెలిపారు.

## బహుళపంచమి పూజలు

నెల్లూరులోని శ్రీ ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం ప్రభుత్వ సంగీత పాఠశాలలో ఈనెల 11న బహుళ పంచమిని పురస్కరించుకుని ప్రిన్సిపాల్ మద్దెల సాయిబాబా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు శ్రీ సీతారామచంద్రులకు పూజలు చేశారు. అనంతరం త్యాగరాజ స్వామి కృతులను ఆలపించారు.

# చిరస్మరణీయులు..రేబాల లక్ష్మీనరసారెడ్డి

## నెల్లూరు టౌన్‌హాలు వ్యవస్థాపక దినోత్సవంలో వక్తలు




నెల్లూరుకు ఎంతో ప్రసిద్ధమైన పురమందిరాన్ని (టౌన్‌హాలు) నిర్మించిన మహాదాత శ్రీ రేబాల లక్ష్మీనరసారెడ్డి పురమందిరం 108వ వ్యవస్థాపక దినోత్సవం ఈనెల 9న వేడుకగా జరిగింది. కవులకు, కళాకారులకు నెలవుగా టౌన్‌హాలును అత్యద్భుతంగా నెలకొల్పిన మహనీయులు, మహాదాత రేబాల లక్ష్మీనరసారెడ్డి అని, ఆయన సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. విశ్రాంత అధికారి సిహెచ్ పెంచలరెడ్డి పాల్గొని రేబాల వారి కీర్తి అజరామరమని కొనియాడారు. తొలుత టౌన్‌హాలు మేనేజింగ్ ట్రస్టు కార్యదర్శి జెఎస్ రెడ్డి, కమిటీ సభ్యులు రేబాల లక్ష్మీనరసారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన్ను స్మరించుకుంటూ పుష్పాంజలి ఘటించారు. అనంతరం ప్రముఖ గాయని జె.బాలార్క ఆమె శిష్యబృందం సంగీత విభావరి, గురుకృప కళాక్షేత్రం సురభి గాయత్రి శిష్యబృందం వారు ప్రదర్శించిన నృత్య రూపకాలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా సృజనాత్మక కళాకారిణి పాబోలు శారదామణిని నిర్వాహకులు ఆత్మీయంగా సన్మానించారు. పద్యకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, వాకాటి విజయకుమార్‌రెడ్డి, ఎంవి సుబ్బారెడ్డి, ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రాంతీయ అధ్యక్షుడు నలుబోలు బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాలో మళ్లీ కరోనా

## అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు

జిల్లాలో ఇటీవల మళ్లీ కరోనా కేసులు వస్తున్నాయి. నెల్లూరు పెద్దాసుపత్రిలో నలుగురు కరోనాతో అడ్మిట్ అయ్యారు. ఆ తర్వాత డిస్చార్జి కూడా జరిగింది. ఈనెల 10 సోమవారం రోజున మరో రెండుకేసులు వచ్చాయి. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు. కరోనా సోకితే వెంటనే చికిత్సలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కోవిడ్ నిర్ధారణ పరీక్షలను పెంచాలని సిబ్బందికి చెప్తున్నారు. ప్రజలు ఆందోళన చెందకుండా, మాస్కులు ధరించడం, బయటకు వచ్చినప్పుడు గుంపుల్లో తిరగకుండా భౌతిక దూరం పాటించడం వంటివి పాటించాలని కోరుతున్నారు.

# చంద్రబాబు జిమ్మిక్కులు పనిచేయవు

### నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



చంద్రమోహన్‌రెడ్డి తమ ప్రభుత్వంపై ఎన్ని రకాల విమర్శలు చేసినా ఆ జిమ్మిక్కులేమీ పనిచేయడని, రాష్ట్ర ప్రజలంతా ప్రజాసంక్షేమ సారథి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైపే ఉన్నారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చెప్పారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' 115వ రోజు కార్యక్రమంలో భాగంగా ఆయన ఈ నెల10న ఇందుకూరుపేట మండలం కొత్తూరు గ్రామంలో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడారు. తాము ఎక్కడికి వెళ్తున్నా ప్రజలు పెద్దఎత్తున స్వాగతిస్తున్నారని, ముఖ్యమంత్రి జగన్ పట్ల ప్రజల్లో ఎనలేని ఆదరణ కనిపిస్తోందని తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను ఆయన ప్రజలకు పంచిపెట్టారు. పిల్లనిచ్చిన మామ ఎన్టీఆర్‌కే వెన్నుపోటు పొడిచిన నీచమైన చరిత్ర చంద్రబాబుదని ఆయన విమర్శించారు. లోకేష్ రోజువారీ కూలీలను పెట్టుకుని ప్రతిసభలో చప్పట్లు కొట్టించుకుంటున్నారని, ఇంతకన్నా దౌర్భాగ్యం ఏముందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాణ్ ఇలా ఎంతమంది వచ్చినా జగన్‌కు తిరుగులేదని, రానున్న ఎన్నికల్లో వైకాపాకే విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఏపి ఎల్‌డిఏ ఛైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, వైస్ ఎంపీపీ కైలాసం లావణ్య, ఎంపీటీసీలు గంగమ్మ, జయశ్రీ, నాయకులు కె.శ్రీనివాసులురెడ్డి, షేక్ షబ్బీర్, నవీన్, దిల్షాద్ బేగం పాల్గొన్నారు.

# శ్రీసిటీలో భక్తిశ్రద్ధలతో..విష్ణు పూజలు



శ్రీసిటీలోని ఆరూరు నర్సరీ వద్ద ఉన్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో నాలుగు రోజుల పాటు ఎంతో భక్తిశ్రద్ధలతో వైభవంగా విష్ణు పూజలు జరిగాయి. విష్ణుసహస్ర నామ పారాయణంతో ఆ ప్రాంతమంతా పులకించిపోయింది. ఈ సందర్భంగా గణపతి హోమం, నవగ్రహ, రుద్ర, మృత్యుంజయ, శ్రీ లక్ష్మీ నారాయణ హోమాలను వేదపండితులు అత్యద్భుతంగా నిర్వహించారు. అనంతరం కలశ ఉద్వాసన పూజలు చేశారు. 10మంది వేద పండితుల ఆధ్వర్యంలో వేడుకగాఈ కార్యక్రమం జరిగింది. ఈ పూజల్లో శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డితో పాటు పలువురు శ్రీసిటీ ఉద్యోగులు, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. నిర్వాహకులు భక్తజనులకు అన్నదానం మరియు తీర్థప్రసాదాలు అందచేశారు.

### శ్రీసిటీని సందర్శించిన విద్యుత్ శాఖ ఎస్ఇ

ఏపీ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ (ఏపిఎస్పీడీసీఎల్) తిరుపతి రీజియన్ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఆపరేషన్స్) ఎం.కృష్ణారెడ్డి ఈనెల 10న సిటీని సందర్శించారు. శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ ఆయనకు సాదర స్వాగతం పలికారు. అనంతరం, పరిశ్రమల ప్రతినిధులతో చర్చా కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఇ, ఇక్కడ విద్యుత్ డిమాండ్, సరఫరా పట్ల సమీక్ష జరిపారు. పరిశ్రమలు ఎదుర్కొంటున్న విద్యుత్ అంతరాయాలు, ఇతర సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎస్ఈతో పాటు పుత్తూరు ఈఈ (ఆపరేషన్స్) చినరెడ్డప్ప, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. శ్రీసిటీ ఎలక్ట్రికల్ హెడ్ డిఎన్ రెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించారు.






# డిఎస్ఆర్ ట్రస్ట్ హైస్కూల్‌లో ప్రవేశ పరీక్ష



అల్లూరు మండలం, నార్త్‌మోపూరు వద్ద ఉన్న దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్ ఉన్నత పాఠశాలలో 2023–2024 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతి ప్రవేశ పరీక్షను ఇటీవల నిర్వహించారు. అల్లూరు మరియు పరిసర ప్రాంతాల ప్రభుత్వ పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నిర్వహించిన ఈ పరీక్షలకు 220 మంది విద్యార్థులు హాజరయ్యారని డిఎస్ఆర్ ట్రస్ట్ ట్రస్టీ దేవిరెడ్డి దశరథరామిరెడ్డి తెలిపారు. తమ సోదరులు సుధాకర్‌రెడ్డి పేద విద్యార్థులకు ఉచిత నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో ఈ పాఠశాలను ఏర్పాటు చేయడం జరిగిందని, తరువాత వచ్చే ఆదివారం ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, ప్రతిభ కనపరచిన విద్యార్థులకు వారి ఆర్థిక స్తోమత పరిశీలించి సీటు కేటాయించడం జరుగుతుందన్నారు. ట్రస్ట్ అడ్మిన్ మేనేజర్ అనీల్ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నాగార్జునరెడ్డి గారు,ఉపాధ్యాయులు, ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.


## 9వ వర్ధంతి



మానవత్వానికి ప్రతిరూపంలా నిలిచారు, దాతృత్వంతో అందరి మనసులు గెలిచారు,
శ్రమించే తత్వానికి ప్రతిబింబం మీరు... మంచిని పంచే వ్యక్తిత్వానికి పెట్టింది మీ పేరు.
మా ఉన్నతికి బాటలువేసి, మా బంగారు భవిష్యత్‌కు మార్గదర్శకులుగా నిలిచిన మా ఇంటి దైవం

**కీ॥శే॥ చెరుకుపల్లి పిచ్చిరెడ్డి గారు**

అధినేత: సిపిఆర్ కళ్యాణ మండపం, శివప్రియ లాడ్జి

పరమపదించి తేది.18.04.2023 నాటికి తొమ్మిదేళ్ళు గడుస్తాయి.

వారి దివ్యస్మృతికి మా నివాళులు.

భార్య: సుబ్బరత్నమ్మ

కుమారుడు - కోడలు: చెరుకుపల్లి పద్మనారాయణరెడ్డి - సుమతి

మనుమలు: హరీశ్వర్‌రెడ్డి - సుస్మిత భువనేశ్వర్‌రెడ్డి

మరియు బంధుమిత్రులు

# ఆరోగ్యం ఉమ్మడి సామాజిక బాధ్యత




అందరికీ ఆరోగ్యం ఉమ్మడి సామాజిక బాధ్యత అని కావలి రెడ్‌క్రాస్ రక్త కేంద్ర కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్ పిలుపునిచ్చారు. ఆరోగ్యం అంటే రోగం లేకపోవడమే కాదని, శారీరకంగా, మానసికంగా, సామాజికంగా పూర్తిస్థాయిలో హాయిగా వుండడమే ఆరోగ్యమన్నారు. కావలి రెడ్‌క్రాస్ భవనంలో రెడ్‌క్రాస్, ఐఎంఎ, జనవిజ్ఞాన వేదికల సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల ప్రపంచ ఆరోగ్యదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఐఎంఎ బాధ్యులు, వివిధ సంఘాల గౌరవ అధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్ ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన ఐదు ఆరోగ్య అంశాలపై యువ ప్రతినిధులు అవగాహన కల్పించారు. అంటు వ్యాధులపై బి.జాహ్నవి, అనువంశిక వ్యాధులపై కె.మధుసూర్య, బాలింతలు, శిశు వ్యాధులపై టి.స్వాతి, పర్యావరణ ప్రతికూల వ్యాధులపై చెన్ను భువిజ, అంతర్జాతీయ ఆరోగ్య బీమాపై పి.మధుతరుణ్‌లు తమ పరిశోధన పత్రాలు సమర్పించారు. ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ బి.సతీష్, జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు రవిప్రకాష్, ప్రసన్నాంజనేయులు, డాక్టర్లు వి.వి.సుబ్బారావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## 'సిద్ధేంద్రయోగి' కూచిపూడి నృత్య కళాకారులకు అవార్డులు



నెల్లూరులోని సిద్ధేంద్రయోగి కూచిపూడి కళాక్షేత్రం చిన్నారులు వృధ్వి, పూర్ణిమశ్రీ, చేవూరు పావని, సులక్షితప్రియదర్శినిల నృత్యప్రతిభకు అవార్డులు లభించాయి. తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో ఈనెల 10న జరిగిన అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవాసంస్థ వారు ఆ చిన్నారులకు అవార్డులు బహుకరించారు. నాట్యగురువు దేగల సాంబశివరావు, కళావేదిక ఛైర్మెన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ వల్లి రమావతి, రాష్ట్ర అధ్యక్షుడు హరి సర్వోత్తమనాయుడు పాల్గొని ఆ చిన్నారులను అభినందించారు.

### అనాధ చిన్నారులకు అండగా..

# 'మిషన్ వాత్సల్య'

**బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి**



పాఠశాలలో చదువుకుంటూ తల్లితండ్రులను కోల్పోయిన చిన్నారులకు, నిరాదరణకు గురైన వారికి, నిరాశ్రయులు, నిస్సహాయులైన బాలలకు 'మిషన్ వాత్సల్య స్పాన్సర్‌షిప్' పథకం కింద ప్రభుత్వం వారికి తగు చేయూతనందిస్తోందని ఏపి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి చెప్పారు. ఇటీవల ఆమె జిల్లాలో పర్యటించి, జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఐసిడిఎస్ ఆధీనంలోని జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో కేంద్ర ప్రాయోజిత పథకం కింద మిషన్ వాత్సల్య స్పాన్సర్‌షిప్ పథకానికి దరఖాస్తులను కోరుతున్నామన్నారు. గ్రామ/వార్డు స్థాయిలో ఉన్న సచివాలయాలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, వలంటీర్లను మిషన్ వాత్సల్య స్పాన్సర్‌షిప్ పథకం అమలులో భాగస్వాములను చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 15వ తేది లోపు దరఖాస్తులు పంపాలని తెలి పారు. ప్రస్తుతం చదువుకుంటున్న 18 ఏళ్ల లోపు బాలబాలికలకు మాత్రమే 'మిషన్ వాత్సల్య' వర్తిస్తుందని వివరించారు. ఈ పథకాన్ని అనాధ బాలబాలికలు సద్వినియోగం చేసుకునేలా చూసి, వారి భవిష్యత్తుకు అండగా నిలవాలని ఆమె ఈ సందర్భంగా ఉపాధ్యాయులను కోరారు.

# చిన్నారులకు అండగా ఎమ్మెల్యే ప్రసన్న



తల్లితండ్రులను కోల్పోయి బాధలు పడుతున్న చిన్నారులకు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి అండగా నిలిచారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన ఇటీవల ఇందుకూరుపేట మండలం కొత్తూరు పంచాయతీలో పర్యటిస్తుండగా, ఎస్సీ కాలనీకి చెందిన ఇరగరాజు నాగమణి, ఇరగరాజు పద్మావతి తల్లిదండ్రులు కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడం గమనించి, ఆ చిన్నారుల పేర్లపై తమ తండ్రి, స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇందుకూరుపేట కో-ఆపరేటివ్ బ్యాంకులో ఇద్దరు పిల్లలకు 18 సంవత్సరాలు వచ్చేంతవరకు 40,000రూపాయలకు ఫిక్సిడ్ డిపాజిట్ చేయించి ఆ పత్రాలను వారి కుటుంబసభ్యులకు అందజేశారు.

# ఎన్‌బికెఆర్‌లో సృజన - 2కె23



కోట మండలం, విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో ఇంజనీరింగ్ విద్యార్థులలో సైన్స్ & హ్యుమానిటీస్ అంశాలకు సంబంధించిన ఆధునిక విషయాలలో సృజనాత్మకతను వెలికితీయడం కోసం "సైన్స్ & హ్యుమానిటీస్' విభాగం ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సింపోసియం "సృజన-2కె23"ను ఘనంగా నిర్వహించారు. కళాశాల సంచాలకులు డా॥ వి.విజయకుమార్‌రెడ్డి, సైన్స్ & హ్యుమానిటీస్ విభాగాధిపతులు డా॥ రవీంద్రారెడ్డి, సృజన 2కె23 కన్వీనర్ డా॥ ప్రవీణ్‌కుమార్ జ్యోతిప్రజ్వలనతో ఈ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలోని సృజనాత్మకత, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమ ముగింపు సమావేశంలో విద్యార్థినీ విద్యార్థులకు ప్రశంసాపత్రాలతో పాటు వివిధ విభాగాలలో ప్రథమ, ద్వితీయ బహుమతులను ప్రదానం చేశారు. వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థినీవిద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# గూడూరులో ఆగిన 'వందేభారత్'



సికింద్రాబాద్ నుంచి తిరుపతికి వెళ్లే 'వందేభారత్' రైలు ఈ నెల 8వ తేదీ రాత్రి గూడూరులో కొద్దిసేపు ఆగడంతో, పట్టణ ప్రజలు, వివిధ వర్గాలకు చెందిన నాయకులు సెల్ఫీలు తీసుకొని ఆనందించారు. పలువురు రైలులోని వసతులపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గూడూరులో 'వందేభారత్ రైలు' నిలిపేలా చూడాలని పలువురు పట్టణ ప్రజలు, రైల్వే అధికారులకు విన్నవించారు. అంతకుముందు ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, వైకాపా నాయకులు పొణకా దేవసేనమ్మ, బత్తిని విజయకుమార్ తదితరులు అధికారులతో కలిసి 'వందేభారత్' రైలుకు స్వాగతం పలికారు.



**మహాత్మా జోతిరావ్ పూలే 197వ జయంతిని పురస్కరించుకుని గూడూరు ఆర్ & బి కార్యాలయం సమీపంలో ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన పూలే - సావిత్రి బాయి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్, బత్తిని విజయ్‌కుమార్, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, తాళ్ళూరు శ్రీనివాసులు, బి.సి సంఘం, ఎంఆర్‌పిఎస్ నాయకులు, తదితరులు**

# ఎల్ఐసి శ్రీనివాసరావుకు సత్కారం



గూడూరు ఎల్ఐసి బ్రాంచ్‌లో 36 సంవత్సరాలుగా పనిచేసి అజాతశత్రువుగా పేరుతెచ్చుకున్న దూబగుంట బాలశ్రీనివాస రావు(డిబిఎస్) మార్చి 31న రిటైర్ అయిన సందర్భంగా ఇటీవల ఎల్ఐసి సిబ్బంది మరియు ఏజెంటు మిత్రులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ మధుబాబు, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ ఎన్.శివకుమార్, నాగరాజు, విజయ భాస్కర్ తదితరులు పాల్గొని ఆయనను సన్మానించారు.

# విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ



గూడూరు, గాంధీనగర్ ప్రాంతంలోని మినీ గురుకులంలో ఎస్వీ రత్నం ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 11న విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కంటి అద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు. ట్రస్టు ఛైర్మెన్ ఎస్.రామ్మోహన్‌రావు, వైకాపా సీనియర్ నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, ప్రతినిధులు ధనుంజయరెడ్డి, వాసుగౌడ్, శ్రీనివాసులు, ప్రసాద్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.




# వైఎస్ఆర్ ట్రస్ట్ మజ్జిగ చలివేంద్రం

వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని పేదవారు ఎక్కువగా వచ్చే గూడూరు పాత బస్టాండ్ సెంటర్‌లో వైఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇటీవల మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ, ట్రస్ట్ వ్యవస్థాపకుడు బత్తిన విజయ్‌కుమార్ ఈ చలివేంద్రాన్ని ప్రారంభించి, పాదచారులకు మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సెబ్ సి.ఐ విజయ్ కుమార్, రైల్వే సి.ఐ లక్ష్మీనారాయణ, నాయకులు బొమ్మిడి శ్రీనివాసులు, నాశిన నాగులు, గోపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీస్త్రీలకు జెవివి భోజనాలు



గూడూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సిద్ధూ హాస్పిటల్ డాక్టర్ హరిప్రసాద్ దాతృత్వంతో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వచ్చిన నిరుపేద గర్భిణి స్త్రీలకు భోజనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ జెవివి వారు ప్రతి ఏప్రిల్ మాసంలో గర్భిణి స్త్రీలకు భోజనాలు పంపిణీ చేసే అవకాశం తనకు కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. జెవివి ఉపాధ్యక్షులు రామమోహన్, గుర్రం విజయ్‌బాబు, చెంచునారాయణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# యుగకవి శ్రీశ్రీ

ఏ.ఎమ్.డి ఇంతియాజ్



'నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను' అంటూ తనదైన సొంత గొంతుకతో మహాకవి శ్రీశ్రీ తెలుగు సాహితీరంగంలో తనదైన విలక్షణమైె కవిత్వంతో యుగకవిగా విశ్వవిఖ్యాతి చెందారని రాష్ట్ర మైనారిటీ వెల్ఫేర్ సెక్రటరీ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సి.ఇ.ఓ. ఏ.ఎమ్.డి ఇంతియాజ్ పేర్కొన్నారు. నెల్లూరులోని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల విజయవాడలో శ్రీశ్రీ జయంతి సందర్భంగా కవిసమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'పదండి ముందుకు, పదండి త్రోసుకు! పోదాం పోదాం పైపైకి.. అనే మకుట గీతం నవయువకులకు స్ఫూర్తిదాయకమైందని వివరించారు. అనంతరం డాక్టర్ కొండూరు హరినారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్టు ఛైర్మెన్ హరినారాయణరెడ్డిని శ్రీశ్రీ సాహిత్య సేవా పురస్కారంతో ఘనంగా సత్కరించారు. వాసవి క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షులు(2019) వేమూల హజరత్తయ్య, అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్‌రాజు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత వల్లభరావు, తెలుగు లలితకళా పరిషత్తు నారాయణరావు, దగ్గుపాటి రాధాకృష్ణ, బి. కృష్ణయ్య, కవయిత్రి రెజీనా, కావూరి సత్యవతి, కవులు, రచయితలు పాల్గొన్నారు.

# ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి



నెల్లూరు కొండాయపాలెంలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో ఈనెల 11న మహాత్మ జ్యోతిరావు పూలే 196వ జయంతిని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. భాస్కరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నవ సమాజ నిర్మాణ కృషీవలుడు, భవిష్యత్తు తరాలకు స్ఫూర్తి ప్రదాత జ్యోతిరావు పూలే అని వారు కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరీష్, సంధ్యారాణి వాలంటీర్లు వినీత, రాశి తదితరులు పాల్గొన్నారు.

# సైనికునికి ఘన నివాళి



జమ్ము కశ్మీర్‌లోని లడఖ్‌లో విధులు నిర్వహిస్తూ, ప్రమాదవశాత్తూ మంచుకొండల్లో జారిపడి, తలకు గాయమై చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయిన సైనికుడు మండ్ల ప్రసాద్‌బాబు భౌతికకాయాన్ని మంగళవారం సీతారామపురానికి తీసుకువచ్చారు. నెల్లూరుజిల్లా సీతారామపురానికి చెందిన ఆయన గత కొంత కాలంగా ఆర్మీలో హవల్దార్‌గా పనిచేస్తున్నారు. ఆయన మృతితో కుటుంబసభ్యులు విషాదంలో మునిగిపోయారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయన పార్థివదేహాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీసు లాంఛనాలతో ప్రసాద్‌బాబు అంత్యక్రియలు జరిగాయి. సిఐ గిరిబాబు, ఎస్ఐ కిశోర్‌బాబు, ఆర్మీ అధికారులు, గ్రామస్తులు, స్థానిక నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# జూదరులు దొరికారు

నెల్లూరు మాగుంట లేఅవుట్ సమీపంలో పేకాటాడుతున్న నలుగుర్ని ఈనెల 12న స్థానిక దర్గామిట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 3800 రూపాయలను, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.



# 'రూరల్'ని.. నెంబర్ 1గా నిలపాలి

**- ఎంపీ ఆదాల పిలుపు**

నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నెంబర్-వన్‌గా నిలపాలని నెల్లూరు ఎంపీ రూరల్ నియోజకవర్గం ఇంచార్జ్, ఆదాల ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో భాగంగా నెల్లూరులోని 21వ డివిజన్‌లో ఆయన ఇటీవల పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో 7 లక్షల మంది గృహ సారథులు,7 లక్షల మంది వలంటీర్లు ఉన్నారని, కోటి 60 లక్షల మంది ఇళ్లకు వెళ్లి సీఎం జగన్మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలపై స్పందనను తెలుసుకుంటారన్నారు. ప్రజలనుంచి వచ్చే స్పందనను బట్టి లోటుపాట్లు ఉంటే సవరించుకుంటామన్నారు. మంచి కార్యక్రమాలు చేస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు తప్పకుండా ఆదరిస్తారని ధీమా వ్యక్తం చేశారు. నేతలు, కార్యకర్తలు ప్రస్తుతం కష్టపడితే రానున్న రోజుల్లో మంచి ఫలితాలు దక్కుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. డిసిసిబి మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, వైసిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు, స్థానిక కార్పొరేటర్ మొయిళ్ళ గౌరీ తదితరులు పాల్గొన్నారు.

## రూరల్‌లో ఆదాల ఇంటింటి ప్రచారం

నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇంచార్జ్, నెల్లూరు ఎంపీ ఆదాల స్వయంగా కొన్ని ఇళ్లకు వెళ్లి 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక వాలంటీరు ఇంటి యజమానిని ప్రశ్నలు అడిగి వారి స్పందనను నమోదు చేసుకున్నారు. ఆ తర్వాత ఇంటి గోడకు స్టిక్కర్ అంటించారు. కరపత్రాన్ని అందజేసి, మిస్డ్ కాల్ ఇచ్చారు.

## అన్నదానం ప్రారంభం

నెల్లూరు గ్రామదేవత, ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఇటీవల ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పట్టణ ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు మెండుగా అందాలని ఆకాంక్షించారు. 41వ డివిజన్ కార్పొరేటర్ కె. విజయలక్ష్మి, వారి మిత్రమండలి వారు ఈ అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఎంపీ ఆదాలకు దేవస్థానం ఛైర్మెన్ ఆర్.ఎస్.ఆర్ స్వాగతం పలికారు.

# విద్యాదాత వాకాటి సేవలు మరచిపోలేం

**- కేవీ చలమయ్య**

విద్యా దాత వాకాటి సంజీవశెట్టి సేవలు ఏనాటికీ మరచిపోలేమని, ఆయన చిరస్మరణీయులని ప్రముఖ స్వాతంత్ర యోధులు సర్వోదయ కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండెంట్ కేవీ చలమయ్య అన్నారు. సంజీవశెట్టి జయంతి పురస్కరించుకొని ఇటీవల నెల్లూరులో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేద-మధ్య తరగతి వర్గాల విద్యార్థులకు విద్య అందించాలన్న సదాశయంతో ఆయన సర్వోదయ కళాశాలను ప్రారంభించి విద్యార్థులకు హాస్టల్‌తో పాటు అన్ని వసతులు కల్పించారని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా ఆయనతో గల పాత స్మృతులను ఆయన గుర్తుచేసుకున్నారు.

# 'జై భారత్' రణభేరిని.. జయప్రదం చేయండి

'జై భారత్' సామాజిక విప్లవ రణభేరి' రాష్ట్ర సదస్సు ఈనెల 16న విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞానమందిరంలో జరుగుతుందని, ఎస్సీఎస్టీబీసీలందరూ పాల్గొని ఆ సదస్సును జయప్రదం చేయాలని ఆ సంస్థ ప్రతినిధులు టి.నాగరాజు, కె.శ్యామ్‌సుందర్, కె.లోకేనాథ్ తదితరులు కోరారు. ఎస్సీఎస్టీ బీసీ హక్కుల సాధన, కులనిర్మూలన అంశాలపై 'జైభారత్' రెండు దశాబ్దాలుగా పోరాడుతోందని చెప్పారు. ఈనెల 11న వారు నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో రణభేరి సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు.

# విద్యుత్ చార్జీలు తగ్గించండి



ప్రజలపై భారంగా పరిణమిస్తున్న విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ కావలి టిడిపి నాయకులు ఈనెల 10న కావలి విద్యుత్‌శాఖ డిఇ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. జగన్‌రెడ్డి పాలనలో ఇప్పటికే 7 సార్లు విద్యుత్‌చార్జీలను పెరిగాయని, వేలకోట్ల రూపాయలు ప్రజలపై అదనపు భారం పడుతోందని, ఈ బాదుడు భరించలేక ప్రజలు, రైతులు నానా బాధలు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. టిడిపి నాయకులు గుత్తికొండ కిషోర్‌బాబు, జ్యోతిబాబురావు, బి.శ్రీహరినాయుడు, ఎస్‌కె మస్తాన్, ప్రసాద్, వెంకట్రావు, గొట్టిపాటి రాము పాల్గొన్నారు.

# టూకీగా...

## దామరమడుగులో రైతుసంఘం ఆవిర్భావ దినోత్సవం

రైతుసంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని ఈనెల 11న బుచ్చిరెడ్డిపాళెంలోని దామరమడుగు గ్రామంలో సిపిఎం, రైతు సంఘం నాయకులు జెండా ఎగురవేసి ఘనంగా జరుపుకున్నారు. జిల్లా రైతు సంఘం కార్యదర్శి మూలి వెంగయ్య, సిపిఎం మండల కార్యదర్శి గండవరపు శ్రీనివాసులు, దామరమడుగు గ్రామానికి చెందిన రైతులు పాల్గొన్నారు

## కావలిలో పేకాటరాయుళ్ళ అరెస్ట్

కావలి తుఫాన్‌నగర్ వద్ద చెట్ల మధ్య పేకాటాడుతున్న ముగ్గురిని ఈనెల 11న కావలి ఎస్ఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 2900 రూపాయలతో పాటు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేశారు.

## పొదలకూరులో పోలేరమ్మకు పొంగళ్ళు

పొదలకూరులోని కాకాణి రమణారెడ్డినగర్‌లో వెలసివున్న శ్రీ ప్రసన్న పోలేరమ్మ అమ్మవారి దేవాలయంలో ఈనెల 11న ప్రత్యేకపూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారికి పొంగళ్ళు వండి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం అమ్మవారికి వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

## 'గణేష్ మిత్రమండలి' నూతన కార్యవర్గం

నెల్లూరులోని గణేష్ మిత్రమండలి సమావేశం ఈనెల 9న ఎన్టీఆర్‌నగర్‌లో జరిగింది. 2023 సంవత్సరానికి నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షునిగా గాలి శ్రీధర్, కార్యదర్శిగా రాజేష్, కోశాధికారిగా ప్రసాద్, సహాయ కార్యదర్శిగా సుప్రజ, సలహాదారులుగా వినయ్, మహేష్, దిలీప్, శశి, స్వామి, భాస్కర్‌నాయుడు, విపుల, రాజశేఖర్, దశరథ ఎన్నికయ్యారు.

## సంగమేశ్వరునికి.. రావణ వాహనసేవ

మండల కేంద్రమైన సంగంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కామాక్షీదేవి సమేత శ్రీ సంగమేశ్వరాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 11న వేడుకగా రావణ వాహనసేవ జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పి.రవీంద్రబాబు పర్యవేక్షించారు.

## కావలిలో పేదపిల్లలకు అన్నదానం

కావలి పట్టణంలోని సంయుక్త సేవా సంస్థ రక్షణలో ఉన్న నిరుపేద పిల్లలకు, అడవిరాజుపాళెంకు చెందిన వరమణి కుమార్, అనిలా దంపతుల కుమార్తె సాహిత జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 9న అన్నదానం చేశారు. సంయుక్త సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర పాల్గొన్నారు.

## వింజమూరు ఆశ వర్కర్స్ కొత్త కమిటీ

వింజమూరు మండల ఆశ వర్కర్స్ యూనియన్‌కు ఇటీవల కొత్త కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పి.అరుణ, సభ్యులుగా బాలమ్మ, పెంచలమ్మ, మంజుల, రాజేశ్వరి, జయలక్ష్మి, నూర్జహాన్ ఎంపికయ్యారు. యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అన్నపూర్ణ, విజయలక్ష్మి, సిఐటియు నాయకుడు భాస్కర్‌రెడ్డి, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

## సైదాపురంలో శ్రీరామ పట్టాభిషేకం

శ్రీరామనవమి పర్వదినాలను పురస్కరించుకుని మండల కేంద్రమైన సైదాపురంలో ఈనెల 9న శ్రీరామపట్టాభిషేకం పూజలను కన్నులపండువగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి సీతారామచంద్రులను దర్శించుకున్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

## రాయితీతో పశుగ్రాసం విత్తనాలు

జిల్లాలో రైతుభరోసా కేంద్రాల్లో 75 శాతం రాయితీతో దాదాపు 130 మెట్రిక్ టన్నుల పశుగ్రాసం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు వాటిని కొనుగోలు చేసుకోవచ్చని పశుసంవర్ధకశాఖ జేడీ మహేశ్వరుడు ఇటీవల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జొన్నలు, మొక్కజొన్న, అలసంద విత్తనాలు కూడా సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

# ఏకమయ్యేనా.. ఏకు మేకయ్యేనా?

(మొదటి పేజీ తరువాయి)

భేటీ అయ్యారు. మోడీకి వ్యతిరేకంగా ఉన్న వారందరిని ఒక తాటిపైకి తేవాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు సమాచారం. 'జగన్ వ్యతిరేక ఓటును చీలనీయం' అని ఆంధ్రాలో పవన్ కళ్యాణ్ చెప్తున్నట్లుగా, మోడీ వ్యతిరేక ఓటును చీలనీయకుండా 'యాంటీ మోడీ' టీంని తయారు చేసి, రాబోవు ఎన్నికలలో పోరాడాలన్నది సదరు సమావేశం ముఖ్య అజెండా అని వార్త.

ప్రధాని మోడీని రాజకీయంగా ఎదుర్కొని, ఎలాగైనా సరే తిరిగి అధికారం సాధించేందుకు కాంగ్రెస్ నానా తంటాలు పడుతోంది. మోడీని ఓడించాలంటే ప్రతిపక్షాలంతా ఏకం కావాలని, అంతకు మించి మరో ప్రత్యామ్నాయం ఏమీ లేదని, కాంగ్రెస్ ఎప్పటినుంచో భావిస్తోంది. దేశంలోని మోడీ వ్యతిరేక నాయకులను ఒక తాటిమీదకు తీసుకువచ్చి, ఎన్నికల్లో నిలిచి గెలవాలన్నదే కాంగ్రెస్ ఆలోచన. ఆ దిశగా ఇప్పుడు అడుగులు పడుతున్నాయి. దేశాన్ని ఏళ్ళతరబడి పాలించిన కాంగ్రెస్, బిజెపి రాకతో, మోడీ దెబ్బతో చతికిలబడిపోయిన నేపథ్యంలో, తిరిగి లేచి నిలబడేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా వేసిన తొలి అడుగుగా.. బుధవారం ఈనెల 12న ఢిల్లీలో విపక్షాలు ఐక్యతారాగం ఆలపించాయి. బిజేపీ వ్యతిరేక కూటమి ఏర్పాటుకు సూచనప్రాయంగా అంకురార్పణ కూడా జరిగింది.

ఎన్నికలు ఏడాది లోపే వస్తున్నాయి కనుక, ఈలోగా చకచకా పావులు కలపాలని రాహుల్‌తో సహ విపక్షనాయకుల హడావిడి. కలిసివచ్చే నేతలను కలుపుకోవాలని, బీజేపీ వ్యతికులతో చర్చలు సాగించి సానుకూల బాటలో పయనించాలని అనుకుంటున్నారు. రానున్న రోజుల్లో మరింతమంది నాయకులు కలిసివస్తారని రాహుల్ భావిస్తున్నారు. కానీ, ఆచరణలో అది ఏ మేరకు ఫలిస్తుందో చెప్పలేని పరిస్థితి. కాంగ్రెస్ ఇక కనుమరుగైపోతుందనుకుంటున్న తరుణంలో, రాహుల్ భారత్ జోడో యాత్ర ఆ నేతల్లో కొంత ఉత్సాహాన్నిచ్చినా, ఎంపీగా అనర్హత వేటు పడిన తర్వాత రాహుల్ గాంధీపై కొన్ని పార్టీలు గతంలో ఉన్న వైఖరిని మార్చుకుని, ఆచితూచి మాట్లాడుతున్నాయని ఢిల్లీ రాజకీయవర్గాల సమాచారం. కాంగ్రెస్‌పై మునుపటి ఉత్సాహం ఆ పార్టీల్లో ఇప్పుడు కనిపించడం లేదంటున్నారు. విభేదాలను కట్టిపెట్టి అందరూ ఒక్కటిగా ముందుకు సాగాలన్న నాయకుల మాటలు వినడానికి బాగానే ఉంటున్నాయి కానీ, ఆచరణలో ఎవరి దారి వారిదే అన్నట్లుగానే ఉంటోంది విపక్షాల పరిస్థితి. అందుకే, పిల్లి మెడకు గంట కట్టేవారెవరన్నది ఇంకా నిర్ధారణ కాలేదు. 'ఈ విపక్ష కూటమికి ఎవరు నాయకత్వం వహిస్తారని'.. మీడియా వాళ్ళు అడిగితే, ఆ నేతలు మాట దాటేస్తున్నారంటే, ఇంకా ఆ నాయకుడెవరో ఒక నిర్ణయానికి రాలేదన్నమాటే కదా!.. మోడీ మ్యాజిక్ ముందు ఇలాంటివన్నీ ఉడకని పప్పులేనని, విపక్షాలవన్నీ విఫల ప్రయత్నాలేనని, అవేవీ ఫలవంతం కాబోవని, కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి రావడం ఇక కల్లేనని బీజేపీ వర్గాలు గట్టిగా చెప్తున్నాయి. ఇప్పటికే రెండుసార్లు ప్రధానిగా గెలిచి అప్రతిహతంగా రాజ్యమేలుతున్న మోడీ, రానున్న ఎన్నికల్లోనూ భారీ మెజార్టీతో గెలిచి, మరోసారి ప్రధానిగా చక్రం తిప్పడం గ్యారంటీ అని కమలం నాయకులు ధీమాగానే చెప్తున్నారు.

### ఖర్గే ఇంట నేతల భేటీ :

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని కలిసికట్టుగా ఎదుర్కొనేందుకు, 'ఐక్య ప్రతిపక్ష ఫ్రంట్' లాంటిదొకటి ఏర్పాటు చేసుకుని ఎన్నికల యుద్ధంలో తలపడేందుకు కాంగ్రెస్, విపక్షాలు సిద్ధమయ్యాయి. కాంగ్రెస్‌తో పాటు జనతాదళ్ (యునైటెడ్), రాష్ట్రీయ జనతాదళ్ అగ్రనేతలు ఢిల్లీలో సమావేశమయ్యారు. కాంగ్రెస్‌నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలతో పలుపార్టీల అగ్రనాయకులు భేటీ అయ్యారు. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, ఆర్‌జేడీ ఛైర్‌పర్సన్ తేజస్వి యాదవ్, జేడీయు అధ్యక్షుడు రాజీవ్ రంజన్‌సింగ్, ఆర్‌జేడీ రాజ్యసభ ఎంపీ మనోజ్‌కుమార్, కాంగ్రెస్ నాయకుడు సల్మాన్ ఖుర్షీద్‌లు ఈ భేటీలో పాల్గొని ఎన్నికల వ్యూహాన్ని చర్చించారు. బీజేపీతో వ్యతిరేకంగా ఉన్న పార్టీలన్నిటినీ కలుపుకోవాలని, ఆ పార్టీలతో చర్చలు జరపాలని నితీశ్‌కుమార్ సూచించగా అందరూ 'సరే' అన్నారు. కాంగ్రెస్ మిత్రపక్షాలైన డిఎంకె, ఎన్‌సిపిలను కూడా తమతో చేర్చుకోవాలని, అంతా కలిసి చర్చించుకున్న తర్వాత, ప్రతిపక్షాలన్నిటితో కలిసి సమావేశం పెట్టి తుది నిర్ణయానికి రావాలని సంకల్పించారు. డిఎంకె అధినేత, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, శివసేన (యుబిటి) అధినేత ఉద్ధవ్ ఠాక్రే తదితరులతో కూడా త్వరలో మరోసారి చర్చలు జరపాలని నిర్ణయించుకున్నారు. ఈ భేటీలో ముఖ్యనేతలతో పాటు జేడీయు అధ్యక్షుడు లాలన్‌సింగ్, బీహార్ పిసిసి చీఫ్ అఖిలేశ్ ప్రసాద్‌సింగ్, ఆర్జేడీ నాయకుడు మనోజ్ ఝూ తదితరులు పాల్గొన్నారు. ఈ కలయిక అపూర్వమని, చరిత్రాత్మకమని రాహుల్ తదితరులంతా ఎవరికి వారు గొప్పగా అభివర్ణించుకున్నారు. ఈ భేటీ తర్వాత బీహార్ సిఎం నితీశ్‌కుమార్‌ను, ఆర్‌జేడీ నేత తేజస్వియాదవ్‌లు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తో సమావేశం కావడం కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. విపక్షాల సమీకరణకు తన 'పూర్తి మద్దతు' ఉంటుందని కేజ్రీవాల్ ప్రకటించి, తను కూడా మీ వాడినే అన్నట్లుగా ఓ మాట వేసి ఉంచారు. విపక్షాల ఐక్యతను సాధించేందుకు కీలకశక్తి బీహార్ ముఖ్యమంత్రి, జేడీయు నేత నితీశ్‌కుమారేనంటూ ఆ పార్టీ పెడుతున్న ట్వీట్‌లు.. విపక్షాలకు స్వీట్లు పంచినట్లుగా ఉంది.

### 'ఐక్యత' సాధ్యమేనా? :

ఏదేమైనా విపక్షాల ఈ తొలి అడుగు, బీజేపీ ప్రాభవాన్ని ఏ మేరకు అడ్డుకుని, ఎన్నికల యుద్ధంలో గెలుస్తుందో చెప్పలేం!.. ఎందరు వ్యతిరేకులు కలుస్తారో.. ఎన్ని పార్టీలు వీరి వెంట నడుస్తాయో ఊహించలేం!..ఏడాదిలో ఎన్నికలుండగా, ఎన్నికల కోసం అప్పటికప్పుడు వేసే ఇలాంటి అడుగులు ఏమేరకు ఫలవంతమవుతాయో?.. తప్పనిసరి అయినప్పుడు తీసే ఇలాంటి 'ఐక్యతారాగాలు' చివరికి అనుకున్నది సాధిస్తాయా?..లేక 'ఎన్నికల రాజకీయాలు'గానే మిగిలిపోతాయా?.. అన్నది ప్రశ్నార్థకమే!

అసలే, రకరకాల ఆరోపణల్లో కూరుకుపోయి, విచారణలకు వెళ్ళాల్సిన అనివార్య పరిస్థితుల్లో.. దేశవ్యాప్తంగా కుదేలైపోయిన కాంగ్రెస్, ఇతర పార్టీలని ఇప్పటికిప్పుడు కలుపుకునిపోవాలంటే ఆచరణలో సాధ్యమయ్యే పనేనా?.. ఒకవేళ కష్టపడి విపక్షాలన్నీ ఏకమైనా, గెలుపు అంత సులువుగా సాధ్యమవుతుందా?.. అన్న ప్రశ్నలకు కాలమే సమాధానం చెప్పాలి!.. అప్పటిదాకా వేచి ఉండక తప్పదు మరి!...

# అభివృద్ధికి వారధులు

(మొదటి పేజీ తరువాయి)

కలెక్టర్ జిల్లాకి కొత్తవారు. ఎస్పీ నెల్లూరుకు పాత చుట్టమే. గతంలో రూరల్ డీఎస్పీగా ఆయన జిల్లాలో పనిచేశారు. తిరుమలేశ్వర్‌రెడ్డి అత్తగారి జిల్లా కూడా నెల్లూరే.

### తనదైన ముద్ర వేసుకున్న చక్రధర్‌బాబు...

జిల్లాలో సుదీర్ఘకాలం పనిచేసిన చక్రధర్‌బాబు విధి నిర్వహణలో తనదైన ముద్ర వేసుకున్నారు. అత్యంత లౌక్యం తెలిసిన అధికారిగా అందరి మన్నలను అందుకున్నారు. నెల్లూరుజిల్లా నాయకులతో సమన్వయం చేసుకుని వారిని సంతృప్తిపరచే స్థాయిలో పనిచేయడం అంటే అంత సులభం కాదు. చక్రధర్‌బాబు విజయవంతంగా తన పదవీ కాలాన్ని పూర్తి చేసుకుని హమ్మయ్య అనిపించుకున్నారు.

### మెప్పించలేకపోయిన విజయారావు...

ఎస్పీ విజయారావు పనిచేసింది కొద్దికాలమే. శాంతి భద్రతల పరిరక్షణలోనూ, అస్తవ్యస్తంగా ఉన్న నగర ట్రాఫిక్ క్రమబద్ధీకరణ వ్యవహారంలోనూ, రాజకీయ కొట్లాటల నియంత్రణ విషయంలోనూ ఆయన ముద్ర పెద్దగా కనిపించకపోవడం గమనార్హం. కుమ్ములాటలు, కొట్లాటలతో వర్ధిల్లుతుండిన అధికారపార్టీ నేతల మధ్యన ఆయన నలిగిపోయారు. రెండువర్గాలనీ మెప్పించేలా పనిచేయడం ఆయనకు సాధ్యం కాలేదనే చెప్పొచ్చు.

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల ఏడాదిలో అడుగుపెట్టిన తరుణంలో జిల్లా ప్రధాన విభాగాల అధికారులిద్దరినీ కొత్త వారిని నియమించడం వారి పనితీరు పట్ల ముఖ్యమంత్రికి ఉన్న నమ్మకమే నిదర్శనమని చెప్పుకోవచ్చు. అందులోను రాబోవు ఎన్నికలలో నెల్లూరుజిల్లా చాలా కీలకం. కొత్త సారధులిద్దరికీ 'లాయర్' అభినందనలు.

### జిల్లా అభివృద్ధే లక్ష్యం - కొత్త కలెక్టర్ హరినారాయణన్



ప్రజలందరి సహకారంతో జిల్లా పురోభివృద్ధికి కృషి చేస్తామని, ప్రజలకు సంక్షేమఫలాలను అందిస్తామని కొత్త కలెక్టర్ హరినారాయణన్ చెప్పారు. ఈనెల 12న ఆయన నెల్లూరు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, జిల్లా సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తామన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధి సాధనకు, ప్రభుత్వ లక్ష్యాలను సాధించేందుకు కృషిచేస్తామన్నారు. తొలుత వేదపండితుల ఆశీస్సులందుకుని కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. జేసీ కూర్మనాథ్, కందుకూరు సబ్‌కలెక్టర్ శోభిక, డిఆర్‌ఓ వెంకట నారాయణమ్మ, నుడా వైస్‌ఛైర్మెన్ బాపిరెడ్డి, ఆర్డీఓలు శీనానాయక్, కరుణకుమారి, జడ్పీ సిఇఓ చిరంజీవి తదితరులతో పాటు అన్నిశాఖల అధికారులు పాల్గొని కొత్త కలెక్టర్‌కు స్వాగతం పలికి శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం ఆయన మంత్రి కాకాణి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామినిలను గౌరవపూర్వకంగా కలుసుకున్నారు.

### నేరాలను నియంత్రిస్తాం - నూతన ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి



జిల్లాలో నేరాలను నియంత్రించి, శాంతిభద్రతలను పరిరక్షిస్తామని నూతన ఎస్పీ కె.తిరుమలేశ్వరరెడ్డి చెప్పారు. ఈనెల 12న ఆయన నెల్లూరుజిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్నారు. మాదకద్రవ్యాలు, డ్రగ్స్ వంటి వాటిని పూర్తి స్థాయిలో కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రౌడీషీటర్లు, పాతనేరస్తులపై నిఘా ఉంటుందన్నారు. ఎల్లవేళలా తాము ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. నేరాల నియంత్రణకు ప్రజల సహకారం అవసరమన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. జిల్లాపై తనకు అవగాహన ఉందని, పటిష్టమైన చర్యలతో జిల్లాలో నేరాలను నిరోధించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన ఎస్పీని ఏఎస్పీలు హిమతి, ప్రసాద్, శ్రీనివాసరావు, పలువురు డిఎస్పీలు కలిసి పుష్పగుచ్ఛాలందజేసి స్వాగతించారు.

# 22న పిఎస్ఎల్‌వి సి-55 ప్రయోగం


శ్రీహరికోటలోని షార్ కేంద్రం నుంచి మరో రాకెట్ నింగిలోకి దూసుకుపోయేందుకు సిద్ధంగా ఉంది. ఏప్రిల్ 22వ తేదీన 'పిఎస్ఎల్‌వి సి-55' ప్రయోగానికి శాస్త్రవేత్తలు సమాయత్తమవుతున్నారు. షార్‌లోని మొదటి ప్రయోగవేదిక మీద నుంచి ఈ ప్రయోగం జరుగనుంది. ఇప్పటికే రెండు దశల రాకెట్ అనుసంధానం పూర్తయింది. మిగిలిన దశలను కూడా పూర్తిచేసే పనిలో నిమగ్నమై ఉన్నారు. ఈసారి సింగపూర్‌కు చెందిన రెండు ఉపగ్రహాలను ఈ రాకెట్ ద్వారా షార్ నుంచి అంతరిక్షంలోకి పంపనున్నట్లు సమాచారం.

# 20న..కాళిదాస జయంతి సభ

నెల్లూరు వర్ధమాన సమాజం ఆధ్వర్యంలో, 'కుమారి పునుగు రమామణి స్మారక నిధి' సంస్థ సారధ్యంలో ఈనెల 20వ తేదీ సాయంత్రం 4 గంటలకు మహాకవి కాళిదాస జయంతి సభ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రముఖ సంస్కృత వ్యాకరణ ఆచార్యులు కొండూరు గోపాలకృష్ణయ్య పాల్గొని 'ఉపమా కాళిదాసశ్య' గురించి ఉపన్యసించి స్మారకనిధి సన్మానం స్వీకరిస్తారని, ఆ సంస్థ పక్షాన టి.రవిచంద్రన్-అపర్ణ పాల్గొంటారని వర్ధమాన సమాజం అధ్యక్ష కార్యదర్శులు పొన్నాల రామసుబ్బారెడ్డి, మజ్జిగ ప్రభాకర్‌రెడ్డిలు పేర్కొన్నారు.

# మే 1 నుంచి.. పెంచలకోన బ్రహ్మోత్సవాలు

## ○ విజయవంతం చేయాలన్న రామ్, మేరిగ



జిల్లాలో ప్రసిద్ది చెందిన పుణ్యక్షేత్రం..పెంచలకోనలో మే 1 నుంచి 7వ తేదీ వరకు అత్యంత వైభవంగా, పవిత్రత ఉట్టిపడేలా బ్రహ్మోత్సవాలు నిర్వహించాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవాలను విజయవంతం చేయాలని వెంకటగిరి నియోజకవర్గం వైకాపా సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌లు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 12న వారు పెంచలకోనలోని టిటిడి కళ్యాణమండపంలో నెల్లూరు ఆర్డీఓ మలోలాతో కలసి అధికారులతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్షించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలకు రాయలసీమ, ప్రకాశం, చిత్తూరు, తిరుపతి, నెల్లూరుజిల్లాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు తరలివస్తారు కనుక, ఈ వేసవిలో వారికి ఇబ్బంది లేకుండా చలువ పందిళ్ళు వేయాలని, మంచినీటి సమస్య లేకుండా చూడాలని రామ్‌కుమార్‌రెడ్డి అధికారులకు సూచించారు. క్షేత్రమంతా పరిశుభ్రతతో ఉండేలా పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటుండాలని చెప్పారు. దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులురెడ్డి, ఇఓ జనార్ధన్‌రెడ్డి, ఆలయ ఛైర్మెన్ చెన్ను తిరుపాల్‌రెడ్డితో పాటు పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, నెల్లూరు రవీంద్రరెడ్డి, తహశీల్దార్ సుభాషిణి, సిఐ కోటేశ్వరరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# దెయ్యాల కొంపల్లా.. టిడ్కో ఇళ్లు

## - నెల్లూరులో చంద్రబాబు ఆగ్రహం

'మా హయాంలో వేలకోట్ల రూపాయలు ఖర్చుపెట్టి రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2.50 లక్షల టిడ్కో ఇళ్లు కట్టాం. జగన్ అధికారంలోకి వచ్చి నాలుగేళ్ళయినా వాటిని ప్రజలకు అందించలేదు. అవన్నీ పాడుబడిపోయి, దెయ్యాలకొంపల్లా తయారయ్యాయి'.. అంటూ తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల ఆయన నెల్లూరు పర్యటనకు వచ్చి, జోన్-4 సమీక్ష నిర్వహించారు. నెల్లూరు, ఒంగోలు, చిత్తూరు, తిరుపతి, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గాల నాయకులతో సమావేశం పెట్టి పార్టీ విషయాలపై చర్చించారు. ప్రజల సంక్షేమం పేరుత పదిరూపాయలిచ్చి, వంద లాగేసుకుంటున్నారని, జగన్ వచ్చాక అన్ని ధరలు పెరిగిపోయాయని, సామాన్యులు బతకలేకపోతున్నారని అన్నారు. జగన్ పెద్ద తిమింగలమని, ఎమ్మెల్యేలు చిన్న తిమింగలాలని విమర్శించారు. ప్రకృతి వనరులను దోచేస్తున్నారని, బెదిరింపులకు పాల్పడుతున్నారని, మాట్లాడితే దౌర్జన్యాలకు దిగుతున్నారని, ప్రజలు వైకాపా పాలనపై విసిగిపోతున్నారని దుయ్యబట్టారు. రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం ఖాయమన్నారు. కుప్పంలోనే కాదు, పులివెందులలోనూ లక్ష ఓట్ల మెజారిటీతో టిడిపి గెలుస్తుందని, ఇందులో ఎలాంటి సందేహం లేదని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఈ సమీక్ష సమావేశంలో టిడిప నాయకులు అచ్చన్నాయుడు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, బీద రవిచంద్ర, అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.



### జగన్‌కు - చంద్రబాబు 'సెల్ఫీ ఛాలెంజ్'

టిడిపి హయాంలో నిర్మించిన నగరంలోని టిడ్కో ఇళ్ళ సముదాయం వద్ద చంద్రబాబు సెల్ఫీ దిగారు. తన మొబైల్ ఫోన్‌తో స్వయంగా సెల్ఫీ దిగి జగన్‌కు ఛాలెంజ్ విసిరారు. 'చూడు....జగన్! ఇవే మా ప్రభుత్వ హయాంలో పేదలకు అప్పట్లో నెల్లూరులో కట్టిన వేలాది టిడ్కో ఇళ్లు'.. అంటూ ట్వీట్ చేశారు. రాష్ట్రంలో టిడిపి పాలనలో, నాడు కట్టిన లక్షల ఇళ్లకు ఇవే సజీవ సాక్ష్యం అంటూ వ్యాఖ్యానించారు. అయితే 'ఈ నాలుగేళ్లలో నువ్వు కట్టిన ఇళ్లెన్ని..నువ్వు కట్టిన ఇళ్లెక్కడ?...జవాబు చెప్పగలవా? అంటూ జగన్‌కు ట్యాగ్ చేస్తూ సెల్ఫీ ఫోటోతో ట్వీట్ చేశారు.

# ఎందరో ట్రంపులు.. అందరికీ వందనాలు!



సీబీఐలో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేసే స్థాయికి చేరుకొని.. తరువాత కొంత కాలానికి స్వచ్ఛంద పదవీ విరమణ చేసి, మహారాష్ట్ర(క్యాడర్) నుంచి స్వరాష్ట్రానికి విచ్చేసిన పూర్వపు ఐపీఎస్ అధికారి వీవీ లక్ష్మీనారాయణను చూస్తుంటే భయమేస్తోంది.

"రాజకీయాలలోకి వస్తున్నాను... విశాఖనుంచి పోటీ చేస్తున్నాను... ఏ పార్టీ నుంచీ అనేది ఇప్పుడే చెప్పలేను..." అని ఆయన తరచుగా అంటున్నారు.

ఆయనకేమో బూతులు, గట్రా మాట్లాడడం రాదు. ఏ విషయాన్ని అయినా వీలైనంత సున్నితంగా, సూటిగా, శషబిషలు లేకుండా చెబుతారు. మొన్నీమధ్య వివేకానంద హత్య కేసులో ఇన్వెస్టిగేటింగ్ అధికారి రామ్‌సింగ్‌ను మార్చి, చౌరాసియా అనే అధికారిని ఐ.ఓగా వేశారు. దానిపై రెండు మూడు తెలుగు న్యూస్ ఛానెళ్లు ఆయనతో వీడియో కాల్ ఇంటర్వ్యూలు పెట్టాయి. రాంసింగ్‌ను మార్చడంతో కేసు నీరు కార్చడమే అనే భావం వచ్చే విధంగా ఆయనతో చెప్పించాలని న్యూస్ యాంకర్లు ప్రశ్నలు సంధించారు. కానీ, ఆయన చట్టంలోని సెక్షన్స్ 163 నుంచి 174 వరకూ ఉదహరిస్తూ రూల్ పొజిషన్ మాత్రమే చెప్పారు. యాంకర్లు చాలా నిరుత్సాహానికి లోనయ్యారు. అదీ లక్ష్మీనారాయణ స్వభావం. దీనితో పాటు అక్రమమార్గాల్లో డబ్బు సంపాదించడమూ తెలియదు. భూకబ్జాలు, సెటిల్మెంట్లు, ఇసుక వ్యాపారం, లిక్కర్ వ్యాపారం, మైనింగ్ లూటీ, గ్రూపులు కట్టి ఎదుటివారిపై విరుచుకుపడడం వంటివాటిని ఆయన కలలో కూడా చేయలేరు.

మరి ఈ "కనీసార్హతలు" కూడా లేకుండా.. నేటి రాజకీయాలలోకి వస్తాను... వస్తాను అని ఆయన అంటున్నారు. పోనీ, ఓటుకో పదివేలు పెట్టి కొనుక్కోగలిగిన స్థితి ఉందా అంటే అదీ లేదు.

ఎప్పుడో చిన్నప్పుడు స్కూల్ పుస్తకాలలో చదువుకున్న దేశభక్తులైన పెద్దల స్ఫూర్తితో... ఇప్పుడు రాజకీయాలలోకి వచ్చి సమాజానికి సేవ చేయాలని లక్ష్మీనారాయణ భావిస్తున్నారేమో తెలియదు గానీ, ఇప్పుడు రాజకీయం అనేది ఒక 'కార్పొరేట్, కుటుంబ వ్యాపారం' అయిపోయింది అనే భావం సమాజంలో బాగా స్థిరపడిపోయింది. ఈ వ్యాపారానికి చదువుతో పని లేదు. సంస్కారంతో పని లేదు.

ఎదుటివారిని తిట్టడానికి ఓ బావురు కప్పంత నోరు, సొంత కులపోళ్ళు గట్టిగా ఉన్న ఓ నియోజకవర్గం, ముందుగా పెట్టుబడికి కొంత డబ్బు, వెనకాలబడి తిరగడానికి ఓ గెద్దం గ్యాంగ్ ఉంటే... పొలిటికల్ బిజినెస్‌లోకి దిగేయవచ్చు. కొంత క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్ ఉంటే మరీ మంచిది. గ్లామర్ కూడా తోడవుతుంది.

'రాజకీయం' అంటే సమాజానికి సేవ చేయడం అనే భావన పోయింది. సమాజంతో రాజకీయం 'డిస్ కనెక్ట్' అయిపోయింది. రాజకీయం అంటే అధికారం. అధికార పార్టీని ఆశ్రయించి కర'వాలం' తిప్పడం. దాని అండతో ఏదో ఒక వ్యాపారం చేసి డబ్బు సంపాదించడం, పైరవీలు... దౌర్జన్యం... ఎక్కడ వీలుచిక్కితే అక్కడ సంపాదించడం. (ఆ సంపాదన అనేది చట్టబద్ధమే కానవసరం లేదు.)

మరి, ఈ సద్లక్షణాలు తనలో ఉన్నాయో... లేవో లక్ష్మీనారాయణ లాంటి కడిగిన ముత్యాలు ఆలోచించుకోవాలి. లేకపోతే, "అడుసు తొక్కనేల.... కాలు కడగనేల..." అని నాలాంటి అభిమానులు ఆయన లాంటి వారినిచూసి విచారించాల్సి ఉంటుంది.

నిజానికి, రాజకీయాల(పబ్లిక్ లైఫ్)లోకి రావడానికి కొన్ని సిద్ధాంతాలు, నైతిక విలువలు ఉండేవి(ట). ప్రజా జీవితంలోకి రావాలి అనుకునే వారు... ఆరు నూరైనా వాటికి కట్టుబడి ఉండేవారు. ఓ ముప్ఫయ్, నలభై సంవత్సరాలు వెనక్కివెళితే... అటువంటి మహానుభావులు మనకు ఊరూరా కనిపించేవారు.

కానీ, ఇప్పుడు ఎక్కడచూసినా ట్రంపులే. ట్రంపిజమే. వ్యాపారాలు, దొంగ లెక్కలు, దొంగ సంపాదనలు, లెక్కను మించిన వివాహేతర సంబంధాలు, వాటిని డబ్బు... పదవులతో కప్పెట్టడాలు, ఎదుటివారిపై బకెట్ల కొద్దీ రాజకీయ బురదను గుమ్మరించడాలు... ఇవే ట్రంపిజం లక్షణాలు.

నిజానికి రాజకీయం అనేది అతి పవిత్రమైనది. కుల, మత, వర్గ, ప్రాంత తేడాలు లేకుండా... వివిధ రంగాలలో మొత్తం సమాజానికి మంచి చేయగలిగిన ఓ గొప్ప, ఉదాత్త వ్యాపకం. సమాజంలోని సమస్త వ్యవస్థలను జనహితం కోసం అదుపు, ప్రభావితం చేయగలిగిన ఉన్నత వ్యాపకం... రాజకీయం.






అటువంటి ఉదాత్త సేవ ఇప్పుడు కుటుంబ వ్యాపారం అయిపోయింది. వందలు, వేల కోట్లను అతి తక్కువ కాలంలో పోగేసుకోడానికి ఓ రాజ మార్గం అయిపోయింది. దోపిడీకి, దౌర్జన్యాలకు చిరునామాగా మారిపోయింది.

డబ్బు పారేసి ఓట్లు కొనుక్కోవడం అనేది సర్వసాధారణం అయిపోయింది. అందువల్ల ఓటర్ల (ప్రజల)పై కనీస గౌరవం అనేది రాజకీయానికి లేకుండా పోయింది. వంద మర్డర్లు చేసినా... యాభై వివాహేతర సంబంధాలతో అందరికీ తెలిసేట్టు తిరిగినా... ఎన్నికల్లో పోటీ చేయడానికి మన ఎన్నికల సంఘం అభ్యంతరం పెట్టదు. ఎన్ని అక్రమ మార్గాల ద్వారా ఎన్ని వందల, వేల కోట్లు సంపాదించుకున్నా... ఎన్నికల్లో ఓట్లు కొనుక్కుని చట్టసభల్లో వికటాట్టహాసాలు చేయవచ్చు. దీంతో, ట్రంపులతో ప్రజా జీవన రంగం కిటకిటలాడిపోతోంది.

రాజకీయాలలో ఉన్న వారిలో చాలామందికి ఒక వ్యాపారం మస్ట్‌గా తయారైంది.. వ్యాపారం వ్యాపకం లేని రాజకీయ కుటుంబాన్ని వేళ్ళ మీద లెక్కించవచ్చునేమో అని పరిశీలకులు అంటుంటారు.

ఒక్క ట్రంప్ దెబ్బకే అమెరికా అల్లకల్లోలం అయిపోతుంటే... వేల వేల ట్రంపులతో మన దేశం పరిస్థితి ఏమిటో గదా!

2016 అమెరికా అధ్యక్ష ఎన్నికలకు ముందు ట్రంప్ గతంలో సాగించిన రంకు బాగోతాలు బయటపెట్టకుండా... ఓ అమ్మడుకు ఓ కోటి రూపాయలు కొట్టినట్టు బయటపడింది.

ఎన్నికలు అయ్యాయి. ట్రంప్ గెలిచాడు. ఆ అమ్మడు తన జీవిత చరిత్రను గ్రంథస్తం చేసింది. అందులో ట్రంప్‌తో సాగించిన రంకును పూసగుచ్చినట్టు వివరించింది. ఎన్నికలకు ముందు నోరు తెరవకుండా ఉండడానికి ఓ కోటి రూపాయలు పంపించాడు అని కూడా రాసింది. మొత్తం అంతా ఉన్నది ఉన్నట్టు విప్పి చెప్పేసరికి (అమెరికాలో ఇలాంటివి చెప్పడానికి సిగ్గుపడరు), ట్రంప్ ఇరుక్కుపోయారు.

అయితే, ఆ డబ్బును ఏ ఖాతాలో చూపించాలో ఓ పట్టాన అర్థం కాక, ట్రంప్ తన ఖాతాలను గజిబిజి చేసి పారేశారని బయటపడింది. దాంతో, న్యూయార్క్ మనహటన్ కోర్టు పిలిచి, రెండు చీవాట్లు వేసి, అరెస్ట్ చూపించి, బెయిల్ ఇచ్చి... మళ్లీ డిసెంబర్ 4న రమ్మంది. ట్రంప్ ఇప్పుడు బెయిల్ మీద ఉన్నారు. అరెస్ట్ అయి, బెయిల్ మీద ఉన్న తొలి అధ్యక్షుడు/ మాజీ కూడా అమెరికా చరిత్రలో ఆయనే.

ఆయన చేసింది అమెరికన్ ప్రజాజీవన ప్రమాణాల ప్రకారం... క్షమించరాని నేరం. ఆ ప్రమాణాలతో పోల్చుకుంటే మనం ఎక్కడ ఉన్నాం?

బెయిల్ మీద ఉండడం మన నేతల్లో ఒక అనివార్య స్టేటస్ సింబల్ అయిపోయింది. చివరకు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ కూడా బెయిల్ మీదే ఉన్నారు. ఇక మిగిలిన 'సలక్షణాలు' గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది అన్నట్టుగా రాజకీయాలు తయారయ్యాయి.

ఇప్పుడే ఇలా ఉంటే... మన పిల్లలు, వారి పిల్లలు, వారి పిల్లల నాటికి ఈ సమాజం ఎలా ఉంటుంది?

మర్డర్లో... మాన భంగమో... చీటింగో... కబ్జానో... దౌర్జన్యమో... బ్యాంకులకు కన్నమో వేస్తూ దొరికిపోయినవారు లేకుండా మన పార్లమెంటూ లేదు. ఏ రాష్ట్ర శాసనసభా లేదు. వారి కనుసన్నల్లో పనిచేసే వివిధ వ్యవస్థలు ఎవరి క్షేమం కోసం పని చేస్తాయి?

నాలుగుపక్కల నుంచి విడుదల అయ్యే పారిశ్రామిక వ్యర్థాలు, కాలుష్యాలతో హైదరాబాద్‌లోని మంచినీటి సరసు హుస్సేన్‌సాగర్ నీరు తాగడానికి పనికి రానట్టుగానే నేరస్థ మయం అయిపోయిన రాజకీయం, దాని అదుపాజ్ఞలలో పనిచేసే వివిధ వ్యవస్థల వల్ల... మన సమాజం నివాసయోగ్యం కాదేమో అని భయపడేవారికి కొరత ఏమీలేదు.

కానీ, ఎవరైనా చేయగలిగింది ఏముంది? ఈ ట్రంపులకు నమస్కారం పెట్టి, పక్కకు తప్పుకోవడం మినహా!

రాజకీయంలో బాగా లోతుగా వేళ్ళూనుకున్న ఈ ట్రంపిజం కొమ్మలు, శాఖలు సమాజంలోని ఇతర వ్యవస్థలకు కూడా వ్యాపించాయని విషయాలు తెలిసిన వారు అంటున్నారు.

ఆవు చేలో మేస్తుంటే.... దూడ గట్టున మేయదు కదా!

"ఎందరో ట్రంపులు.... అందరికీ వందనాలు...."

- భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com